# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 198 | హైదరాబాద్ | బుధవారం 28-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఫ్రాన్స్ లో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన

## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

: టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం



11లో

- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

## ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు



11లో

- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

**హైదరాబాద్ ఆకాశంలో 'వింగ్స్ ఇండియా' సందడి: రష్యా విమానాల విన్యాసాలు.. ఫ్లయింగ్ టాక్సీల తళుకులు**

11లో



11లో

## ముగిసిన హల్వా వేడుక...

**బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!**

- కేంద్ర బడ్జెట్ 202627 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్ ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం.. పడగొట్టినవి నిలబెడదాం



11లో

- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాయలసీమ, ప్రకాశం జిల్లాల సమగ్రాభివృద్ధిపై ప్రధానంగా దృష్టి
- 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పత్తులే లక్ష్యంగా కార్యాచరణ
- ప్రాధాన్యత క్రమంలో 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆదేశం
- గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రణాళికలు





11లో

## మేడారం జాతరకు సర్వం సిద్ధం..

- నాలుగు రోజుల పాటు జరగనున్న మేడారం సమ్మక్కసారక్క మహాజాతర ప్రారంభం
- ఈ వేడుకకు రెండు కోట్ల మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా
- రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ. 251 కోట్లతో భారీ ఏర్పాట్లు



10లో

## సింగరేణిలో 'సృజన'త్మక దోపిడీ!

- టెండర్లలో కొత్త రూల్.. పైసా వసూల్!
- సీఎం బావమరిది కోసమే 'సైట్ విజిట్' నిబంధన?
- మెగావాట్ సోలార్‌కు 7 కోట్లా? దేశమంతా 3 కోట్లేగా!
- కోల్ మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా రేవంత్ సర్కార్.
- గవర్నర్‌కు ఆధారాలు సమర్పించిన కేటీఆర్ బృందం..

**అర్ధరాత్రి స్కెచ్:**

## గూబ గుయ్ మనేలా నోటిఫికేషన్.. విపక్షాల గుండెల్లో రైళ్లు.!

ఒకాయన అర్ధరాత్రి కటిక చీకట్లో గొర్రెల మంద కాడికి పోయి, ఒక్కటే సారి గట్టిగా ఈల కొట్టిండట. పాపం.. ఆ గొర్రెలు ఉలిక్కిపడి కళ్లు తెరిచేలోపే, 'తెల్లారేసరికి ఎవడు దొరికితే వాని మెడలో గంట కట్టేయాలి' అని హుకుం జారీ చేసిండట. ఇప్పుడు మన మున్సిపల్ ఎన్నికల ముచ్చట కూడా అచ్చం ఇట్నే ఉంది. విపక్షాలేమో 'పైసలు సర్దుకోవాల్నా? బీ-ఫారాలు పట్టుకోవాల్నా?' అని కాళ్లు కాలిన పిల్లుల్లా అల్లాడుతుంటే, సర్కారు మాత్రం 'నో డ్యూస్' సర్టిఫికేట్ల సాకుతో కడ్డీలు పెట్టి ముసిముసి నవ్వులు నవ్వుతోంది. కులగణన లొల్లి కోర్టు మెట్లెక్కకముందే, అపోజిషన్ ఊపిరి తీసుకోనియ్యకుండా రాత్రికి రాత్రే 'స్కెచ్' గీసి, తెల్లారేసరికి నోటిఫికేషన్ దంచికొట్టింది. ఇది ప్రజాస్వామ్య వేగం కాదు నాయనా.. విపక్షాలను 'ఆగం' జేసి గద్దెనెక్కే గజకర్ణ గోకర్ణ విద్య అని జనం నవ్వుకుంటున్నరు!"

12లో




- బీసీ రిజర్వేషన్ల కొట్లాట: కోర్టు మెట్లెక్కకముందే.. పని ముగించేయాలనే యోచన..!
- నో డ్యూస్ పంచాయితీ: బకాయిల పేరిట బ్రేకులు.. అభ్యర్థులకు వడపోత గండం!
- గులాబీ కోటలో హస్తం జోరు: కారుకు బ్రేకులు వేసి.. అర్బన్ గడ్డపై జెండా పాతాలని కసి!
- కమలం కన్ఫ్యూజన్: గల్లీ ఫైట్ రెడీనే గానీ.. అభ్యర్థుల వేటలో కమలనాథుల తిప్పలు!

భారత శక్తి

# అన్ సంగ్ హీరోస్ కు పట్టం

పద్మ పురస్కారాలు దేశానికి విభిన్న రంగాల్లో తమ వంతు కంట్రిబ్యూషన్ ఇచ్చిన వారికి ఇచ్చేందుకు స్థాపించినవి. ఆ అవార్డుల ద్వారా వచ్చేది .. వారు దేశానికి సేవ చేశారని గుర్తింపు. కానీ దశాబ్దాల పాటు ఈ అవార్డులు సిఫార్సులు బలంగా చేయించుకున్నవారికే వచ్చేవి. అందుకే వాటిపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. కానీ గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పద్ధతిని మార్చేసింది. నిజంగా దేశానికి తమ ప్రతిభతో..సేవతో..కళతో సేవ చేసిన వారికే ఇస్తున్నారు. ఈ సారి కూడా ఆ సంప్రదాయం తప్పలేదు.ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల జాబితా, అవార్డుల ఎంపికలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అద్దం పడుతోంది. రాజకీయ సిద్ధాంతాలు, పార్టీ ప్రయోజనాలకు అతీతంగా కేవలం దేశ సేవను, అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని పురస్కారాలను అందించడంలో మోదీ ప్రభుత్వం వందకు వంద మార్కులు కొట్టేసింది. కరడుగట్టిన విమర్శకులు సైతం మెచ్చుకునేలా, అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన అసాధారణ వ్యక్తులను వెలికితీసి గౌరవించడం ఒక గొప్ప సంప్రదాయంగా మారింది.గతంలో కాంగ్రెస్ హయాంలో పద్మ పురస్కారాల ఎంపికపై అనేక విమర్శలు ఉండేవి. ప్రధానంగా ఢిల్లీ వర్గాల్లో పట్టున్న వారు, సిఫార్సుల ద్వారా లేదా రాజకీయ పలుకుబడితో ఈ అవార్డులను పొందుతున్నారనే అభిప్రాయం బలంగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు చేసుకోకపోయినా, ప్రచారానికి దూరంగా ఉంటూ నిశ్శబ్దంగా సమాజ సేవ చేస్తున్న అన్‌సంగ్ హీరోస్ కోసం వెతికి మరీ పద్మ గుర్తింపు ఇస్తున్నారు. ఇది ఒక పారదర్శకమైన, ప్రజాస్వామ్యబద్ధమైన వ్యవస్థకు నిదర్శనం.రాజకీయ వైరుధ్యాలను పక్కన పెట్టి ప్రత్యర్థి పార్టీల నేతలను కూడా వారి సేవలకు గాను సత్కరించడం ద్వారా ప్రధాని మోదీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వీఎస్ అచ్యుతానందన్, శిబూ సోరెన్ వంటి నేతల ఎంపికే దీనికి నిదర్శనం. రాజకీయంగా ఎంతటి తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ, ప్రజా జీవితంలో వారు చూపిన ముద్రను ప్రభుత్వం గౌరవించింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవకులను గుర్తించింది. ముఖ్యంగా కమ్యూనిస్టు దిగ్గజం, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌ను దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' తో గౌరవించడం చర్చనీయాంశమైంది. బీజేపీ ప్రభుత్వ సిద్ధాంతాలకు, అచ్యుతానందన్ ప్రాతినిధ్యం వహించే వామపక్ష భావజాలానికి మధ్య తీవ్ర వైరుధ్యం ఉన్నప్పటికీ, ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని , ప్రజా పోరాటాలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించారు. ఇదే కోవలో జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్‌కు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా, సమాజంపై ప్రభావం చూపిన నేతల సేవలను పరిగణనలోకి తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. భావజాల విభేదాలు ఉన్నప్పటికీ, విపక్ష నేతలకు వారి స్థాయికి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా కేంద్రం ఒక సానుకూల సంకేతాన్ని పంపింది.పద్మ అవార్డులను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది:పద్మ విభూషణ్: దేశంలో రెండవ అత్యున్నత పౌర పురస్కారం. అసాధారణ, విశిష్ట సేవలకు దీనిని ఇస్తారు.పద్మ భూషణ్: మూడవ అత్యున్నత పురస్కారం. ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు గుర్తింపు.పద్మశ్రీ: నాల్గవ అత్యున్నత పురస్కారం. ఏ రంగంలోనైనా ప్రతిభ చాటిన వారికి, ముఖ్యంగా సామాన్యులకు ఇచ్చే గౌరవం.గతంలో ప్రభుత్వమే పేర్లను సూచించేది, కానీ ఇప్పుడు ప్రక్రియ పూర్తిగా మారింది. సామాన్య ప్రజలు కూడా తమకు తెలిసిన అర్హులను నామినేట్ చేయవచ్చు. చివరికి ఎవరికి వారు 'సెల్ఫ్ నామినేషన్' చేసుకునే అవకాశం కూడా ఉంది. ప్రతి ఏటా ప్రధానమంత్రి ఏర్పాటు చేసే ఈ కమిటీ, వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తుంది.చాలామంది ఈ అవార్డుతో పాటు డబ్బు వస్తుందని అనుకుంటారు. కానీ, పద్మ అవార్డులతో ఎటువంటి నగదు బహుమతి లేదా నెలవారీ భత్యాలు ఉండవు. వీరికి లభించే మర్యాదలు ఇవే.సనద్ డ మెడల్: రాష్ట్రపతి సంతకంతో కూడిన ప్రశంసా పత్రం (సనద్), ఒక పతకం ఇస్తారు.ప్రభుత్వ అతిథులు: వీరు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని 'స్టేట్ గెస్ట్స్'గా పరిగణించి వసతి, రక్షణ కల్పిస్తాయి.రైల్వే పాస్‌లు: నిబంధనల మేరకు భారతీయ రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుంది.ముఖ్య వేడుకలు: గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానాలు అందుతాయి.పద్మ అవార్డు అనేది ఒక గుర్తింపు మాత్రమే, అది బిరుదు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 18(1) ప్రకారం.. గ్రహీతలు తమ పేరుకు ముందు లేదా వెనుక అని వాడుకోకూడదు.ప్రస్తుతం ఈ అవార్డుల విధానంలో గొప్ప మార్పు వచ్చింది. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉండి నిస్వార్థంగా సేవ చేస్తున్న 'అన్‌సంగ్ హీరోస్' (గుర్తింపు లేని వీరులు) ను వెతికి పట్టుకుని ప్రభుత్వం గౌరవిస్తోంది. ఇది కేవలం ఒక పతకం కాదు, భారత గడ్డపై ఆ వ్యక్తి ముద్రించిన అంకితభావానికి నిదర్శనం.కొన్ని సందర్భాల్లో రాజకీయ వ్యూహాల కోసమే కొంతమందికి అవార్డులు ఇస్తున్నారనే వాదనలు వినిపించినప్పటికీ, ఎంపికైన వారి వ్యక్తిగత అర్హతలను ఎవరూ వేలెత్తి చూపలేని పరిస్థితి ఉంది. కళా, సాహిత్య, సామాజిక , క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేయడంలో ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం. రాజకీయం అనేది ఎన్నికల వరకేనని, దేశ గౌరవం విషయానికి వస్తే అందరూ ఒక్కటేననే భావనను ఈ పురస్కారాల పంపిణీ కలిగిస్తోంది. పద్మ పురస్కారాల ఎంపికలో నెలకొన్న ఈ సానుకూల మార్పు దేశంలో ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సంప్రదాయానికి పునాది వేస్తోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ, వారు ఏ మూలన ఉన్నా ఏదో ఒక రోజు గుర్తింపు లభిస్తుందనే నమ్మకాన్ని ఈ వ్యవస్థ కల్పిస్తోంది. ఇలాంటి నిష్పాక్షికమైన వ్యవస్థ కొనసాగడం దేశాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి ఎంతో అవసరం.


# వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40% ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్ట చెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

# అమరావతికి చట్టబద్ధత..

అమరావతి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:



అమరావతి రాజధాని కి చట్టబద్ధతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ చట్టం చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు వరుసగా కేంద్ర మంత్రులతో సమావేశాలు కావడం.. టిడిపి తో పాటు కూటమి ఎంపీలకు కీలక సూచనలు చేయడం చూస్తుంటే మాత్రం బిల్లు పార్లమెంట్ లోకి వస్తుందని అర్థమవుతోంది. అయితే ఇప్పుడు ఆ 29 గ్రామాలను మాత్రమే కలిపి అమరావతిగా గుర్తిస్తారా? లేకుంటే పక్కన ఉన్న విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ గుర్తిస్తారా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటికే అమరావతి అంటే మున్సిపాలిటీ కాదు అని.. అదో మహానగరం గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కేంద్రం చట్టబద్ధత కల్పిస్తున్న దృష్ట్యా అమరావతిని మరింత విస్తృతపరచి గుర్తించాల్సిన అవసరం ఉంది. విజయవాడ తో పాటు గుంటూరు నగరాలను కలిపితేనే.. అమరావతి అనేది ఒక అద్భుతమైన నగరంగా ఆవిష్కృతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. అందరి అభిప్రాయంతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 50 వేల ఎకరాల వరకు సమీకరించి అమరావతి రాజధాని పనులను మొదలుపెట్టారు. ఇంతలోనే అధికార మార్పిడి జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. దీంతో అమరావతి నిర్వీర్యం అయింది. గత ఐదేళ్లపాటు అమరావతి రైతులు పడరాని పాట్లు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి చుక్కలు చూపించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి పునరుజ్జీవం వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి కూడా. అయితే ఇప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధానిపై విషం కక్కుతూనే ఉంది. దీంతో అమరావతికి చట్టబద్ధత తెస్తే కానీ తమకు శాంతి ఉండదని అమరావతి రైతులు కోరుతూ వచ్చారు. అందుకే ఏపీ విషయంలో ప్రత్యేక పరిగణలోకి తీసుకొని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది.అయితే కేవలం 29 పంచాయితీలను మాత్రమే అమరావతిగా గుర్తిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ఇప్పటికే అదనపు భూసేకరణ చేపడుతున్నారు. చెంతనే విజయవాడ ఉంది. ఆపై గుంటూరు నగరం కూడా ఉంది. కృష్ణా,గుంటూరు, ఎన్టీఆర్ తో పాటు పరిసర జిల్లాల్లో కొన్ని ప్రాంతాలను అమరావతిలో చేర్చితే ఇదో మహానగరంగా, ప్రపంచ స్థాయి నగరంగా గుర్తించబడుతుంది. ఇప్పటికే అమరావతిలో నవ నగరాలు నిర్మించాలన్నది ప్రణాళిక. అందుకు తగ్గట్టు చంద్రబాబు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇటువంటి తరుణంలో ఆ 29 పంచాయితీలకే అమరావతిని పరిమితం చేయడం ఎంత మాత్రం సుముఖత కాదు. అయితే అందుకే సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో పాటు ఎంపీలతో సమన్వయం చేసుకుంటున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత విషయంలో సానుకూలతలకు ప్రయత్నిస్తున్నారు. విస్తృత సంప్రదింపులు జరపాలని పార్టీ ఎంపీలకు సూచిస్తున్నారు. మొత్తానికైతే అమరావతి చట్టబద్ధత విషయంలో ఏం జరుగుతుంది అనే దానిపై అంతటా చర్చ నడుస్తోంది.

# వెలిగొండ ప్రాజెక్ట్ క్రెడిట్ వార్

ఒంగోలు, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'క్రెడిట్ వార్' తారాస్థాయికి చేరింది. దశాబ్దాలుగా నలుగుతున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఇప్పుడు అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీల మధ్య మాటల యుద్ధానికి వేదికైంది. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు ప్రాంతాల తలరాతను మార్చే ఈ ప్రాజెక్టును తామే పూర్తి చేశామని ఒకరు.. కాదు తామే పునాది వేసి పరుగులు పెట్టించామని మరొకరు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.వెలిగొండ ప్రాజెక్టుకు 1996లో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే, 2004లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే ఈ ప్రాజెక్టుకు నిధుల ప్రవాహం పెరిగింది. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టును ప్రాధాన్యత క్రమంలో చేర్చి, సుమారు రూ. 3,610 కోట్లను వెచ్చించారు. ప్రధాన కాలువలు, హెడ్ రెగ్యులేటర్ పనులను వైఎస్సార్ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఆ తర్వాత 2014-19 మధ్య చంద్రబాబు టన్నెల్ బోరింగ్ మెషీన్లను రంగంలోకి దించి, అత్యంత క్లిష్టమైన మొదటి టన్నెల్ పనులను 90శాతం పూర్తి చేశారు. 2019-24 మధ్య జగన్ రెండో టన్నెల్ తవ్వకాన్ని పూర్తి చేసి, ఎన్నికలకు ముందు ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించాలని నిర్ణయించుకోవడంతో రాజకీయం రాజుకుంది. "మేము వేల కోట్లు ఖర్చు చేసి టన్నెల్ పనులను పూర్తి చేస్తే, ఇప్పుడు చంద్రబాబు వెళ్లి ఆ క్రెడిట్‌ను దొంగిలించాలని చూస్తున్నారు" అని వైసీపీ ఆరోపిస్తోంది. జగన్ హయాంలోనే ప్రాజెక్టు పూర్తయిందని వారు వాదిస్తున్నారు.అయితే, టీడీపీ ఈ వాదనను బలంగా తిప్పికొడుతోంది. కేవలం టన్నెల్ తవ్వకం పూర్తి చేస్తే ప్రాజెక్టు పూర్తి అయినట్లా అని ప్రశ్నిస్తోంది. ప్రాజెక్టుకు గుండెకాయ లాంటి పునరావాసం పనులను జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఎద్దేవా చేస్తోంది. ఇంకా 7,500 పైచిలుకు కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉంది. కాలువల లైనింగ్, వంతెనల నిర్మాణం లాంటి కీలక పనులు పెండింగ్‌లో ఉండగానే జగన్ కేవలం ఓట్ల కోసం రిబ్బన్ కట్ చేశారని టీడీపీ మండిపడుతోంది. దాదాపు రూ. 9,000 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయంలో వైసీపీ చేసింది కేవలం రూ. వెయ్యి కోట్ల పనులేనని, మిగిలిన 80 శాతం శ్రమ ఇతర ప్రభుత్వాలదేనని వారు గణాంకాలు వివరిస్తున్నారు.ప్రస్తుతానికి వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్ల తవ్వకం పూర్తయిన మాట వాస్తవం. కానీ, సాంకేతికంగా చూస్తే టన్నెల్-2 లో లైనింగ్ పనులు, ఫీడర్ కెనాల్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అన్నింటికంటే ముఖ్యంగా, రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నింపాలంటే 11 ముంపు గ్రామాల్లోని ప్రజలకు సుమారు రూ. 1,400 కోట్లు చెల్లించి పునరావాసం కల్పించాల్సి ఉంది. ఈ పనులు పూర్తి కాకుండా రైతు పొలాలకు చుక్క నీరు కూడా చేరదు.రాజకీయ పార్టీల వాదనలు ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో ప్రజలు మాత్రం "నీరు ఎవరి హయాంలో వస్తుంది?'' అన్నదే కొలమానంగా చూస్తున్నారు. తవ్వకాలు ఒక ప్రభుత్వం చేస్తే, నిధులు మరొకరు ఇచ్చారు. కానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం 2026 జూన్ నాటికి మిగిలిన రూ. 3,000 కోట్ల పనులను పూర్తి చేసి, నిర్వాసితులకు న్యాయం చేసి నీటిని విడుదల చేస్తే.. అంతిమంగా ప్రజల దృష్టిలో వారికే క్రెడిట్ దక్కే అవకాశం ఉంది. ఈ లోపు ఈ క్రెడిట్ వార్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని సెగలు పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ముంబై పాలిటిక్స్‌లో జెన్ జీ హవా.. ఏకంగా 12 మంది కార్పొరేటర్ల విజయం

ముంబై, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల ఫలితాలు సరికొత్త రాజకీయ ఒరవడికి నాంది పలికాయి. ఈసారి ముంబై ఓటర్లు అనుభవజ్ఞుల కంటే ఉత్సాహవంతులైన యువతకే మొగ్గు చూపారు. 2026 బీఎంసీ ఎన్నికల్లో ఏకంగా 12 మంది జెన్‌జీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా విజయం సాధించి కౌన్సిల్ హాల్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. ఇందులో 22 ఏళ్లకే కార్పొరేటర్‌గా ఎన్నికై కశీష్ ఫుల్వారియా చరిత్ర సృష్టించారు.ఆసియాలోనే అత్యంత ధనిక కార్పొరేషన్ అయిన ముంబై బీఎంసీ ఎన్నికలు.. గత కొన్నిరోజులుగా దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ఎన్నికలు ముగిసినా మేయర్ ఎన్నిక పెండింగ్‌లో ఉండటంతో అందరి దృష్టి ఇప్పుడు ముంబై మేయర్ ఎవరు అనే దానిపై పడింది. మేయర్ సీటును జనరల్ మహిళకు కేటాయించారు. అయితే ఈ బీఎంసీ ఎన్నికల్లో 12 మంది యువ జెన్‌జీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలిచి సంచలనం సృష్టించారు. బీజేపీకి చెందిన 22 ఏళ్ల కశీష్ ఫుల్వారియా అతి పిన్న వయస్కురాలైన కార్పొరేటర్‌గా రికార్డు నెలకొల్పారు.89 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలవగా.. త్వరలో ముంబైకి జనరల్ కేటగిరీ నుంచి మహిళా మేయర్ పీఠం దక్కనుంది. యువ రక్తం రాకతో ముంబై పాలనలో కొత్త మార్పులు రానున్నాయి. మరోవైపు.. ముంబై మున్సిపల్ చరిత్రలోనే అతి పిన్న వయస్కురాలైన కార్పొరేటర్‌గా 22 ఏళ్ల కశీష్ ఫుల్వారియా రికార్డు సృష్టించారు. బీజేపీ తరపున వార్డు నంబర్ 151 (చెంబూరు/కుర్లా) నుంచి పోటీ చేసిన కశీష్ ఫుల్వారియా.. తన సమీప ప్రత్యర్థిపై ఘన విజయం సాధించారు. మాజీ కార్పొరేటర్ రాజేష్ ఫుల్వారియా కుమార్తె అయిన కశీష్ ఫుల్వారియా.. ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నారు. సాంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి.. టెక్నాలజీ సాయంతో వార్డు సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈసారి గెలిచిన యువ కార్పొరేటర్లలో కేవలం రాజకీయ వారసులే కాకుండా.. ఉన్నత విద్యావంతులు కూడా ఉండటం విశేషం. వీరిలో హోమియోపతి డాక్టర్ సమన్ అజ్మీ (29), జ్యువెలరీ డిజైనర్ దిశా యాదవ్ (29), ఎంబీఏ గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తం 227 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో బీజేపీ 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించగా.. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 65, ఏకనాథ్ షిండే శివసేన 29 స్థానాలను దక్కించుకున్నాయి. లాటరీ ప్రకారం.. ఈసారి ముంబైకి జనరల్ కేటగిరీ మహిళ నుంచి మేయర్ ఎంపిక కానున్నారు. మెజారిటీ స్థానాలను దక్కించుకున్న బీజేపీ-షిండే కూటమి నుంచి ఒక మహిళా నేత ముంబై మేయర్‌గా బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైంది. ఫిబ్రవరిలో జరగనున్న మేయర్ ఎన్నికల కోసం అప్పుడే ముంబైలో రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి.తమ కార్పొరేటర్‌కే మేయర్ పదవి వస్తుందని బీజేపీ నేతలు భావిస్తుండగా.. గత కొన్ని దశాబ్దాలుగా ముంబై మేయర్ పీఠం శివసేనకే ఉందని.. అందుకే ఆ అవకాశం తమకే ఇవ్వాలని.. అప్పుడే తమది నిజమైన శివసేన అని అంతా భావిస్తారని షిండే శివసేన వర్గం పట్టుబడుతోంది. దీంతో మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందనేది ఇంకా ఉత్కంఠగానే మారింది.

# మార్చిలో రిలీజ్ డేట్ల గందరగోళం

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

సంక్రాంతి సీజన్ ముగిసింది. మన శంకర వర ప్రసాద్ గారు, నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు చిత్రాలు విజయ పథం వైపు దూసుకెళ్లాయి. 2026కి ఇది గొప్ప బూస్టప్. తొలి నెలలోనే మూడు మంచి విజయాలు అందుకోవడం తో టాలీవుడ్ ఊపిరి పీల్చుకొంది. ఈ స్పీడు.. ఈ జోరు ఇలానే కొనసాగాలని కోరుకొంటోంది. ఆ అవకాశాలూ పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే రాబోయే సీజన్‌లో మంచి సినిమాలే రాబోతున్నాయి. కాకపోతే కావల్సిందల్లా ప్లానింగే. అదే.. మన నిర్మాతల మధ్య లోపించిందేమో అనిపిస్తోంది.ఫిబ్రవరి వదిలేస్తే.. మార్చి టాలీవుడ్ కు చాలా కీలకం. వేసవి సీజన్ అప్పటి నుంచే మొదలు కానుంది. కాకపోతే మార్చిలో రాబోతున్న సినిమాలపై ఇంకా ఓ క్లారిటీ రాలేదు. ప్లానింగ్ ప్రకారం పెద్ది, పారడైజ్ సినిమాలు రావాల్సివుంది. ఒక రోజు వ్యవధిలో ఈ సినిమాల రిలీజ్ డేట్లు ప్రకటించేశారు నిర్మాతలు. కాకపోతే.. ఇప్పుడు ఈ రెండు సినిమాలూ రావడం లేదు. దాంతో మార్చి స్లాట్ ఖాళీ అయిపోయింది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 27న వస్తుందని అనుకొంటున్నా అధికారిక ప్రకటన రాలేదు.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం

విజయవాడభారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కే?ంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే. అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది.. అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి.తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది. అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.

గుంభనంగా క్యాడర్

చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి



క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్ లను కూడా లోకేశ్ కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్ లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉ ంటే జగన్ ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు.దీంతో స్థానిక శాసనసభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్స్‌డ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉ న్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.

# ఏపీలో రాజ్యసభ రేస్ షురూ...

అమరావతి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:



ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈ ఏడాది జూన్ తో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉ ండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉ మామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. భాష్యం రామకృష్ణ సైతం ఎంపీగా పోటీ చేయాలని చూశారు. అప్పట్లో అవకాశం దక్కలేదు. రాజ్యసభ ద్వారా ఆ కోరిక తీర్చుకోవాలని చూస్తున్నారు. గల్లా జయదేవ్ అయితే 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. అయినా సరే పార్టీతో అనుబంధం ఎక్కువ. రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావు అయితే పార్టీ కోసం టికెట్ వదులుకున్నారు. తనకు రాజ్యసభ ఇవ్వాలని కోరుతున్నారు.అయితే సాధారణంగా రాజ్యసభ పదవి అంటే కార్పొరేట్ సెక్షన్ తో కూడుకున్నది. జాతీయస్థాయిలో సంబంధాలు, పెద్ద పెద్ద వ్యవహారాలు చూసేవారికి ఆ పదవి కట్టబెడతారు. అందుకే ఈసారి కొత్త వ్యక్తులకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అనూహ్యంగా కొందరు వ్యక్తులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని టిడిపి వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో చూడాలి. కానీ ఆశావహులు మాత్రం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

# విజయసాయిరెడ్డి పాదయాత్ర...

నెల్లూరు,భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చాణక్యుడుగా పేరుగాంచిన విజయసాయి రెడ్డి మళ్లీ వార్తల్లో నిలిచారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు నంబర్ 2గా చక్రం తిప్పి, అనూహ్య పరిణామాల మధ్య ఆ పార్టీని వీడిన ఆయన, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్ కోసం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది



రాజకీయాలకు గుడ్ బై చెప్పి వ్యవసాయం చేసుకుంటానన్న ఆయన, ఇప్పుడు రూటు మార్చి మళ్లీ రాజకీయ క్షేత్రంలోకి అడుగుపెడుతుండటం ఏపీ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.2024 ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీలో వచ్చిన మార్పులు, అధినేత జగన్ మోహన్ రెడ్డితో పెరిగిన దూరం విజయసాయి రెడ్డిని తీవ్ర నిర్ణయం తీసుకునేలా చేశాయి. అప్పట్లో తన ఎంపీ పదవికి రాజీనామా చేసిన ఆయన, రాజకీయాలు తనకు ముగిసిన అధ్యాయమని ప్రకటించారు. అయితే, ఇటీవల ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో భాగంగా ఈడీ ఎదుట హాజరైన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. "జూన్ తర్వాత రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అవుతాను.. మరిన్ని వివరాల కోసం ఈ నెలాఖరు వరకు వేచి ఉండండి" అని ఆయన చెప్పడం ద్వారా తన ఉద్దేశాన్ని స్పష్టం చేశారు.విజయసాయి రెడ్డి మళ్లీ వస్తున్నారంటే అది ఏ పార్టీ నుంచి అనేదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై ఆయన చేసిన ఘాటు విమర్శల నేపథ్యంలో ఈ కూటమిలో ఆయనకు చోటు దక్కడం అసాధ్యం. జగన్ తో ఉన్న విభేదాలు, పార్టీలోని 'కోటరీ' వ్యవహారాల వల్ల మళ్లీ సొంత గూటికి చేరే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో బీజేపీ అగ్రనేతలతో విజయసాయికి ఉన్న సత్సంబంధాల దృష్ట్యా ఆయన కమలం తీర్థం పుచ్చుకుంటారని కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది.కానీ, తాజా విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఆయన ప్రస్తుతానికి ఏ పార్టీలోనూ చేరడం లేదని తెలుస్తోంది. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును, బలాన్ని నిరూపించుకున్న తర్వాతే పార్టీ విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. రాజకీయాల్లో తిరుగులేని ముద్ర వేయాలంటే ప్రజల్లోకి వెళ్లడమే ఏకైక మార్గమని విజయసాయి రెడ్డి విశ్వసిస్తున్నట్లు కనిపిస్తోంది. తన రాజకీయ గురువులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. ఇద్దరూ పాదయాత్రల ద్వారానే అధికార పీఠాన్ని అధిష్టించారు. అదే ఫార్ములాను ఇప్పుడు విజయసాయి కూడా ఎంచుకున్నట్లు సమాచారం. జూన్ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టాలనేది ఆయన మాస్టర్ ప్లాన్ గా తెలుస్తోంది.పాదయాత్ర వెనుక విజయసాయి రెడ్డికి కొన్ని లక్ష్యాలున్నాయి. ప్రజల నాడిని పట్టుకోవడం ఇందులో ముఖ్యమైనది. క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రస్తుత ప్రభుత్వంపై, వైసీపీపై ఏ అభిప్రాయంతో ఉన్నారో తెలుసుకోవాలని సాయిరెడ్డి భావిస్తున్నారట. ఏ పార్టీ అండ లేకుండా తానూ జనాన్ని ప్రభావితం చేయగలనని చాటి చెప్పడం కూడా పాదయాత్ర వెనుక మరో ఉద్దేశం. పాదయాత్రలో వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా కొత్త పార్టీ పెట్టాలా లేక బీజేపీ వంటి జాతీయ పార్టీలో చేరాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారని ఆయన సన్నిహితులు చెప్తున్న మాట.విజయసాయి రెడ్డి పాదయాత్ర ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. ఒకవేళ ఆయన సొంతంగా పార్టీ పెడితే, అది వైసీపీ ఓటు బ్యాంకును చీల్చుతుందా? లేక కూటమి వ్యతిరేక ఓటును ఆకర్షిస్తుందా? అనేది ఆసక్తికరం. లిక్కర్ స్కామ్ వంటి కేసుల నీడలో ఆయన చేస్తున్న ఈ ప్రయాణం కేవలం రాజకీయ అస్తిత్వం కోసమేనా లేక చట్టపరమైన ఇబ్బందుల నుంచి రక్షణ కోసమా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి.మొత్తానికి, వ్యవసాయం నుంచి మళ్లీ రాజకీయ వ్యవహారాల వైపు మళ్లుతున్న విజయసాయి రెడ్డి, జూన్ తర్వాత ఏపీ రాజకీయాల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తారో చూడాలి. పాదయాత్ర ఆయనకు రాజమార్గం అవుతుందో లేదో తెలియాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

# యూపీ తర్వాతే ఏపీనే...

తిరుపతి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ బడుల్లో పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కేంద్రం సహకారంతో.. పీఎంశ్రీ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ, వృత్తి విద్యతో పాటు ఆధునిక విద్యను అందిస్తోంది. ఆటపాటలతో పాటు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లల సమగ్ర వికాసానికి కృషి చేస్తోంది. భవిష్యత్తుకు బాటలు వేసేలా ఈ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నారు. దేశంలోనే యూపీ తర్వాత ఏపీలోనే ఎక్కువ పీఎంశ్రీ స్కూళ్లు ఉ న్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ దిశగా కేంద్రం సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉత్తర్‌ప్రదేశ్‌లో 1,725 పీఎంశ్రీ పాఠశాలలతో మొదటి స్థానంలో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 935 పాఠశాలలతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం 60 శాతం నిధులను.. మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. పీఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.407.53 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటికే సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఈ పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశారు. స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్వహణ ఖర్చుల కోసం నిధులను విడుదల చేశారు. ఈ నిధులు రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఇచ్చారు.రాష్ట్రంలో 794 పాఠశాలల్లో 9 నుండి 12 తరగతుల విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 10 రకాల వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టడానికి వీలుగా ప్రతి పాఠశాలలో ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడానికి 1,898 ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. ఈ కోర్సుల కోసం 1,898 మంది శిక్షకులను నియమించగా.. శిక్షణ ఇచ్చేందుకు అర్హత కలిగిన శిక్షకులను నియమించారు. వీరిలో 400 మంది ఎన్ఎస్‌డీసీ నుంచి గుర్తింపు పొందిన నిపుణులు. ఇది విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూస్తుంది. ఈ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందిస్తాయి.విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దసరా, సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు సమీపంలోని పరిశ్రమలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్నారు. అంతేకాదు వృత్తి విద్య కోర్సులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారు. ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన 'కౌశల్ బోధ్' పుస్తకాలను ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు అందజేస్తున్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్లకు అవసరమైన ప్రత్యేక సామాగ్రిని అందిస్తారు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస విధానం (పాల్)ను అమలు చేస్తున్నారు.ఈ పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ మేరకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి ఆర్వో (రివర్స్ ఆస్మోసిస్) ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పరిశుభ్రత కోసం ఆధునిక మరుగుదొడ్లు, చేతులు కడుక్కోవడానికి ప్రత్యేక పాయింట్లను నిర్మిస్తున్నారు. బాలికల సౌకర్యం కోసం వారికి అవసరమైన శానిటరీ ప్యాడ్లను అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని సులభంగా పొందేందుకు వెండింగ్ మెషీన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకోవడానికి, పాఠాలు చెప్పడానికి అవసరమైన ఫర్నిచర్‌ను అందిస్తున్నారు.పాఠశాలల్లో సైన్స్ విద్యను ప్రోత్సహించడానికి, భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రయోగశాలల్లో విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు చేసి, సైన్స్ విషయాలను లోతుగా అర్థం చేసుకోగలుగుతారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి, పాఠశాలలకు ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా, పాఠశాల ప్రాంగణంలో ఎక్కడైనా ఇంటర్నెట్ ఉపయోగించుకోవచ్చు. విద్యార్థుల భద్రత కోసం, పాఠశాలల్లో అన్ని చోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. స్మార్ట్ తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, ప్రొజెక్టర్లు వంటి ఆధునిక పరికరాలు ఉంటాయి. విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి, వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉండే గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారుశారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నారు. ఆట స్థలాలను అభివృద్ధి చేసి, విద్యార్థులు ఆడుకోవడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. బాలికలకు తమను తాము రక్షించుకోవడానికి ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో మంచి కెరీర్ ఎంచుకోవడానికి, పిల్లలకు అవసరమైన కౌన్సెలింగ్‌ను అందిస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్స్, గైడ్స్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల బ్యాండ్లు, సంగీతం వంటి కళల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే పీఎంశ్రీ స్కూళ్లలో కార్పొరేట్ బడులకు దీటుగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు అధికారులు.

# కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఎంట్రీ ఫర్ హిందూస్ ఓన్లీ

న్యూఢిల్లీ,భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ ప్రవేశాలపై కీలక ప్రకటన వెలువడింది. ఈ రెండు ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించాలని బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. మతపరమైన సంప్రదాయాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కమిటీ ఛైర్మన్ తెలిపారు. విశ్వాస కేంద్రాలైన ఈ ధామ్‌లలోకి తమ విశ్వాసాన్ని గౌరవించేవారినే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదన త్వరలో బోర్డు ముందుంచనున్నారు. దీనికి బోర్డు ఆమోదం లభిస్తుందని భావిస్తున్నారు.దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్ , బద్రీనాథ్ ఆలయాల్లోకి ఇకపై కేవలం హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. హిందువులు కాని వారు ఈ ఆలయాల్లోకి ప్రవేశించడానికి వీలు లేకుండా నిషేధం విధించాలని.. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ బీకేటీసీ ఛైర్మన్ ధ్రువీకరించారు. హరిద్వార్‌లోని కుంభమేళా ప్రాంతంలో 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని ప్రతిపాదన వచ్చిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం.బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు.. బీకేటీసీ పరిధిలోకి వచ్చే మరో 47 ఆలయాల్లో కూడా హిందువులు కాని వారిని ప్రవేశించకుండా నిషేధం విధించేలా చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తోంది. ఈ ప్రతిపాదనను త్వరలో బీకేటీసీ బోర్డు ముందు ఉంచే అవకాశం ఉంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చాలా మంది భాగస్వాములు దీనికి మద్దతు ఇస్తున్నారు.బీకేటీసీ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, హిందువులు కానివారిని నిషేధించాలనే ప్రతిపాదన చాలా కాలం నుంచి ఉందని తెలిపారు. "దీనిని ఆదిశంకరాచార్యుల కాలం నుంచీ పాటిస్తున్నారు. మతపరమైన సంప్రదాయాలను కాపాడుకోవడంలో తప్పులేదని మేము భావిస్తున్నాము," అన్నారు. "చారిత్రాత్మకంగా, హిందువులు కాని వారి ప్రవేశం ఆలయాలలో నిషేధించబడింది," అని ఆయన తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 26ని ఉటంకిస్తూ, మతపరమైన వర్గాలకు తమ వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు ఉందని, కాబట్టి ఈ నిర్ణయం తీసుకోవడానికి కమిటీకి పూర్తి హక్కు ఉందని ఆయన స్పష్టం చేశారు. "హిందువులు కానివారు" అనే పదాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదని కూడా ఆయన స్పష్టం చేశారు. "మా విశ్వాసాన్ని గౌరవించేవారు స్వాగతించబడతారు. ఈ ధామ్‌లు పర్యాటక కేంద్రాలు కావు, అవి విశ్వాస కేంద్రాలు," అని ఆయన పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం హరిద్వార్‌లోని 105 ఘాట్‌లలో హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించడం గురించి ఆలోచిస్తోంది. అలాగే, హరిద్వార్, రిషికేశ్‌లను 'సనాతన పవిత్ర నగరం'గా ప్రకటించాలని కూడా పరిశీలిస్తోంది. హరిద్వార్ అర్ధ కుంభమేళాతో ఈ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని, 1916లో గంగా సభ వ్యవస్థాపకుడు మదన్ మోహన్ మాలవ్యతో జరిగిన ఒప్పందంలోని నిబంధనలను కూడా దీనికి ఉపయోగించుకోవచ్చని వర్గాలు తెలిపాయి.ఈ ప్రతిపాదనలు భక్తులలో చర్చనీయాంశంగా మారాయి. ఆలయాల పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇది పర్యాటకులను, ఇతర మతాల వారిని ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. ఈ విషయంలో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ ట్రాప్ లో గులాబీ దళం

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:



తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఊహించని వ్యూహంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌ను ఊపిరాడనీయకుండా చేస్తోంది. ఒకవైపు వరుస కేసులు, విచారణలు, నోటీసులతో బీఆర్‌ఎస్ అగ్రనేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తూనే, మరోవైపు మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ తన శ్రేణులను సిద్ధం చేసేసింది. గులాబీ దళం ఆత్మరక్షణలో పడి ఉన్న సమయంలోనే, హస్తం పార్టీ అగ్రనేతలు గ్రౌండ్ లెవల్‌లో అభ్యర్థుల ఎంపికను, వ్యూహరచనను సైలెంటుగా పూర్తి చేసుకుంటున్నారు.బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ ఒక పక్కా ట్రాప్ లోకి లాగేసినట్లు కనిపిస్తోంది. అగ్రనేతలంతా న్యాయపరమైన చిక్కులు, విచారణల నుంచి ఎలా బయటపడాలనే దానిపైనే దృష్టి పెట్టడంతో, పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని గాలికొదిలేశారు. దీనివల్ల కిందిస్థాయి నాయకులకు సరైన దిశానిర్దేశం కరువైంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో అత్యవసరమైన ఆర్థిక సాయం విషయంలో కూడా పార్టీ అగ్రనేతల నుంచి ఎలాంటి హామీ అందకపోవడం, కేడర్‌లో నైరాశ్యాన్ని నింపుతోంది. అంతా మీరే చూసుకోండి అని కిందిస్థాయి నేతలకు వదిలేయడం, పరోక్షంగా వారిని నిస్సహాయులను చేయడమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది.మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణమైనా వెలువడనుంది. ఫిబ్రవరి రెండో వారం నాటికే ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయ్యేలా ప్రభుత్వం పావులు కదుపుతోంది. తీరా షెడ్యూల్ వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ మేల్కొన్నా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. కాంగ్రెస్ అప్పటికే అభ్యర్థుల ఖరారు, ప్రచార పర్వంలో ముందుండగా, బీఆర్‌ఎస్ మాత్రం ఆఖరి నిమిషంలో అభ్యర్థుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. కేడర్‌ను సమన్వయం చేసుకునే సమయం కూడా వారికి చిక్కనివ్వకుండా కాంగ్రెస్ తన వ్యూహాన్ని అమలు చేస్తోంది.ఈ ఎన్నికల యుద్ధంలో కాంగ్రెస్ అగ్రనేతలు వార్డులు, కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికలో కూడా వ్యక్తిగత ఆసక్తి చూపిస్తూ బాధ్యతలు పంచుకున్నారు. కానీ, బీఆర్‌ఎస్ అగ్రనేతలు మాత్రం కోర్టులు, నోటీసుల చుట్టూ తిరుగుతుండటంతో పార్టీ క్యాడర్ కు దిశానిర్దేశం లేకుండా పోయింది. తాము రాజకీయం కంటే కేసులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వచ్చిందని, కాంగ్రెస్ తమను తెలివిగా బుక్ చేసిందని బీఆర్‌ఎస్ గ్రహించే లోపే ఎన్నికలు ముగిసిపోతాయి. శత్రువును యుద్ధరంగంలో కాకుండా, ఆలోచనల్లోనే ఓడించాలి అన్నట్లుగా కాంగ్రెస్ వేసిన ఈ ఎత్తుగడ బీఆర్‌ఎస్‌ను కోలుకోలేని దెబ్బ తీసేలా ఉంది. ఒక పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతున్న ఈ పరిణామాలు తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలకు దారితీసినా ఆశ్చర్యపోనక్కర్లేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

# ధరణి.. కథ ఇంతింత కాదయా..

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

బీఆర్‌ఎస్ హయాంలో తీసుకు వచ్చిన ధరణి పోర్టల్ భూకబ్జాలకు కేంద్రంగా మారిందని తెలంగాణ ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ నివేదిక సమర్పించినట్లుగా తెలుస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు తాజాగా ప్రభుత్వం నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలినట్లుగా తెలుస్తోంది. సిద్దిపేట, సిరిసిల్ల వంటి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ విచారణలో గ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని చెబుతున్నారు.రికార్డులు సరిగ్గా లేని భూములు, వివాదాస్పదమైన ఖరీదైన ఆస్తులను ఒక మాఫియాగా ఏర్పడి నిబంధనలకు విరుద్ధంగా తమ పేర్ల మీదకు మార్చుకున్నట్లు ప్రాథమిక నివేదిక స్పష్టం చేస్తోంది. అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు మరియు నిషిద్ధ జాబితా లో ఉన్న భూములను అత్యంత రహస్యంగా ధరణి రికార్డుల నుంచి తొలగించి, ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి మార్చినట్లుగా బయటపడిందని చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి పరిధిలో సుమారు 15,000 ఎకరాల పైచిలుకు ప్రీమియం భూములు అక్రమాలకు గురైనట్లు లెక్కలు తేలాయని నివేదికలో ఉన్నట్లుగా తెలుస్తోంది.వీటి విలువ అక్షరాలా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. అర్ధరాత్రి వేళల్లో పోర్టల్ ఓపెన్ చేసి డేటాను మార్చడం, విదేశాల నుంచి సర్వర్లను ఆపరేట్ చేయడం వంటి తీవ్రమైన అంశాలను విచారణాధికారులు గుర్తించారు. ఇటీవల మీడియాలో వస్తున్న సత్యం స్కాం భూముల వ్యవహారం కూడా ఈ నివేదికలో కీలకంగా మారినట్లు తెలుస్తోంది. గతంలో వివాదాల్లో ఉండి, రిజిస్ట్రేషన్లకు వీలులేని భూములను ధరణిలోని మోడ్యూల్స్ మార్పుల ద్వారా బీఆర్‌ఎస్ పెద్దలకు అనుకూలంగా మార్చినట్లు ఆరోపణలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4,848 ట్రాన్సాక్షన్లలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని నివేదికలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది.ఈ నివేదికను ప్రభుత్వం పూర్తిస్థాయిలో బహిర్గతం చేస్తే, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అతిపెద్ద కుంభకోణాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఫోన్ ట్యాపింగ్ పేరుతో సీరియల్ ను నడుపుతున్నారని బీఆర్‌ఎస్ నేతలు విమర్శిస్తున్నారు..తర్వాత ధరణి స్కాంలపై సీరియల్ నడిచే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో తెలంగాణలో పెద్ద ఎత్తున రాజకీయ దుమారాన్ని రేపడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆడిట్ కు రెడీ అవుతున్న ప్రభుత్వం

ధరణి వ్యవస్థలో జరిగిన అవకతవకలపై రాష్ట్రవ్యాప్తంగా మిగతా 31 జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. కేరళ కేంద్రంగా పనిచేసే సంస్థతో ఇప్పటికే.. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. అయితే ఆ ఆడిట్ పూర్తైందని.. ఆ నివేదికను ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు.కాగా, పేదలకు చెందిన ఇంచు భూమి కూడా అక్రమార్కులకు దక్కకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన సుమారు 5,500 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లు నిష్పక్షపాతంగా భూ సర్వేలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. కాగా, భూ భారతి స్కీమ్ కింద, రోవర్ టెక్నాలజీని ఉపయోగించి భూమి కొలతలు, సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. అందుకోసం సర్వేయర్లకు ఆధునికమైన రోవర్స్ సామగ్రి పంపిణీ చేస్తున్నామని మంత్రి చెప్పారు.నక్షా లేని 5 గ్రామాల్లో పైలట్ ఇప్పటికే సర్వే నిర్వహించామని, ఇందులో ఖమ్మం జిల్లాలోని ములుగుమాడు కూడా ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా నక్షాలులేని 413 గ్రామాల్లో మొదటి విడత సర్వే చేస్తామన్నారు. ఈ భూ సర్వేను విడతలవారీగా పూర్తిచేస్తామని.. భూముల మ్యాప్‌తో పాటు భూధార్ నంబర్లను అందించడంలో లైసెన్స్ సర్వేయర్లు ఉపయోగపడతారని మంత్రి పొంగులేటి తెలిపారు.భూ సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే పరిమితం చేయకుండా డీసెంట్రలైజ్డ్ చేశామన్నారు మంత్రి. ఇలా చేయడం వల్ల చాలా వరకు సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయని మంత్రి చెప్పారు. అయితే భూభారతి రిజిస్ట్రేషన్లలో భారీ కుంభకోణం జరిగిందనే ఆరోపణలను మంత్రి ఖండించారు. రూ. 1000 – రూ. 15000 కోట్ల స్కామ్ ఆరోపణలు అసత్యం అని చెప్పారు.ధరణి వ్యవస్థలో అవకతవకల కారణంగా రిజిస్ట్రేషన్ లో రూ. 3.90 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించామని మంత్రి పొంగులేటి చెప్పుకొచ్చారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి.. సొమ్ము రికవరీకి చర్యలు చేపట్టామని తెలిపారు.

# జీవన్ రెడ్డిని లైట్ తీసుకుంటున్న కాంగ్రెస్

కరీంనగర్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

తెలంగాణ కాంగ్రెస్ లో కొత్త, పాత నేతల మధ్య వార్ ఊపందుకున్నట్లు కనిపిస్తుంది. అయితే మిగిలిన చోట్ల కొంత నేతలు కామ్ గా ఉన్నప్పటికీ సీనియర్ నేత జీవన్ రెడ్డి మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి పెత్తనం చేసే వారిని ఉపేక్షించడానికి ఇష్టపడటం లేదు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యేగా గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన సంజీవ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన అప్పటి నుంచి తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. అయినా రాష్ట్ర నాయకత్వం కానీ, కేంద్ర నాయకత్వం కానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఇక సమయం వచ్చినప్పుడల్లా జీవన్ రెడ్డి తన అసహనాన్ని బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. తాను రాజీ పడేది లేదని జీవన్ రెడ్డి కాంగ్రెస్ నేతలకు హెచ్చరికలు పంపుతున్నారు.కాంగ్రెస్ పార్టీలో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడు జీవన్ రెడ్డి ప్రస్తుతం పార్టీ అధిష్టానం తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గాంధీ భవన్ వేదికగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కాంగ్రెస్ నాయకత్వ అహంపై దెబ్బకొడుతున్నాయి. ఒకప్పుడు రేవంత్ రెడ్డికి గట్టి మద్దతుదారుగా నిలిచిన జీవన్ రెడ్డి, నేడు అదే నాయకత్వం తనను విస్మరించడంపై భగ్గుమంటున్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన తన వంటి సీనియర్లను గౌరవించడంలో రాష్ట్ర నాయకత్వం విఫలమైందనే భావన ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తి అసంతృప్తి మాత్రమే కాదు, పార్టీ అంతర్గత క్రమశిక్షణకు జరుగుతున్న పెద్ద డ్యామేజ్.జీవన్ రెడ్డి ఆగ్రహానికి ప్రధాన కారణం ఆయన సొంత నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు. జగిత్యాలలో ఆయన ఎవరిపైన దశాబ్దాలుగా పోరాటం చేశారో, అటువంటి నేతలను ఆయనకు కనీసం సమాచారం ఇవ్వకుండా పార్టీలో చేర్చుకోవడం జీవన్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. ఫిరాయింపులను ప్రోత్సహించడమే కాకుండా, నియోజకవర్గంలో పాత శత్రువులకే పెత్తనం అప్పగించడం ఆయన రాజకీయ ఉనికిని ప్రశ్నార్థకం చేసింది. తన రాజకీయ ఆసక్తులను కాపాడాల్సిన బాధ్యత ఉన్న రాష్ట్ర నాయకత్వం, ఆయనను పక్కన పెట్టేయడం సీనియర్ నేతకు మింగుడుపడటం లేదు.త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల బాధ్యతలను కూడా తనకు ఇబ్బందికరంగా ఉన్న నేతలకే అప్పగించడం జీవన్ రెడ్డికి అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. పార్టీలో తనను ఒంటరిని చేస్తున్నారనే ఉద్దేశంతో, ఆయన ఇప్పుడు పార్టీకి ఎంత నష్టం చేయాలో అంతా బహిరంగంగానే చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్ అయోమయంలో పడటం, సీనియర్ నేతలే రోడ్డెక్కడం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతోంది.జీవన్ రెడ్డి వంటి కీలక నేతను బుజ్జగించడంలో, తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలమవుతోంది. సీనియర్ల అనుభవాన్ని ఉపయోగించుకోకపోగా, వారిని కించపరిచేలా వ్యవహరించడం వల్ల పార్టీకి దీర్ఘకాలికంగా నష్టం జరిగే అవకాశం ఉంది. జీజీవన్ రెడ్డి అసంతృప్తిని తగ్గించకపోతే జగిత్యాలకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని కొంత మంది సీనియర్లు అంటున్నారు.జీవన్ రెడ్డి తరచూ కాంగ్రెన్ పార్టీ రాష్ట్ర నాయకత్వంపైన కూడా విరుచుకుపడుతున్నారు. నిజమైన కాంగ్రెస్ నేతలను పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దూరం పెట్టారని, ఇది భవిష్యత్ లో పార్టీ ఎదుగుదలకు మంచిది కాదని చెబుతున్నారు. తాజాగా ఆయన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కూడా బహిష్కరించి వెళ్లిపోయారు. ఆ సమావేశానికి ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ను ఆహ్వానించడమే పెద్దాయన కోపానికి కారణం. దీంతో జీవన్ రెడ్డి తాను అనుకున్నది మీడియా ముందు కక్కేసి బయటకు వెళ్లిపోయారు. నిజానికి జీవన్ రెడ్డికి సీనియర్ నేతగా పార్టీ అన్యాయం చేసిందనే చెప్పాలి. పార్టీ కష్టకాలంలో జెండా వదలకుండా అట్టిపెట్టుకుని బీఆర్‌ఎస్ పై పోరాటం చేసిన జీవన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ పదవిలేకుండానే ఇప్పటి వరకూ గడిపారు.ఇక వేచి చూసి లాభం లేదని భావించిన పెద్దాయన వాయిస్ పెంచినట్లు కనపడుతుంది. దీర్ఘకాలంగా, పార్టీ అధికారంలో లేనప్పుడు కూడా కాంగ్రెస్ జెండాను వదలకుండా పోరాడిన జీవన్ రెడ్డిని పక్కన పెట్టడంపై ఆయన వర్గం సీరియస్ గా ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఆయన కాంగ్రెస్ లో కీలక నేతగా కొనసాగుతున్నారు. దాదాపు నలభై ఏళ్ల నుంచి ఆయన రాజకీయాల్లో ఉన్నారు. తొలుత టీడీపీ నుంచి ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమయినా తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి ఆయన కొనసాగుతున్నారు. జీవన్ రెడ్డి ఇక తాడో పేడో తేల్చుకోవడానికే సిద్ధమయినట్లు కనిపిస్తుంది. ఆయన ఇక కీలక నిర్ణయం తీసుకునే అవకాశముందని పరా?టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. మరి జీవన్ రెడ్డిని బుజ్జగించే వారు కూడా ప్రస్తుతం రాష్ట్ర నాయకత్వంలో లేకపోవడంతో ఆయనకు ఢిల్లీ హైకమాండ్ పిలిచి హామీ ఇస్తేనే కాస్త శాంతించే అవకాశముంది. లేకుంటే మాత్రం కాంగ్రెస్ కు నష్టమే.



# ఎవరీ సృజన్ రెడ్డి

హైదరాబాద్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న అత్యంత వివాదాస్పదమైన, ఆసక్తికరమైన పేరు సూదిని సృజన్ రెడ్డి. ప్రతీ దానికి సృజన్ రెడ్డి పేరును తెరపైకి తెస్తున్న బీఆర్‌ఎస్.. రేవంత్ పై ఆరోపణలు చేస్తోంది. కానీ ఈ సృజన్ రెడ్డి బీఆర్‌ఎస్ హయాంలోనే ఎక్కువ కాంట్రాక్టులు పొందారని డీటైల్స్ వెలుగులోకి వచ్చాయి.సూదిని సృజన్ రెడ్డికి కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, అధికార పార్టీ ఏదైనా తన హవాను కొనసాగించగల వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. సృజన్ రెడ్డికి ఉన్న రాజకీయ సంబంధాల చార్ట్ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆయన మాజీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి అల్లుడు కాగా, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భార్య వైపు నుంచి ఆయనకు కాస్త దూరం బంధుత్వం ఉంది. ఇలా అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం రెండింటితోనూ ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.సృజన్ రెడ్డి పేరు మొదట ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రాచరంలోకి వచ్చింది. ఈ కేసులో ఈడీ, సిబిఐ సోదాలు జరిగినప్పుడు ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అప్పట్లో బీఆర్‌ఎస్ అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా, ఆ పార్టీ ఆర్థిక మూలాల్లో కీలక వ్యక్తిగా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. రాజకీయ వర్గాల్లో కొందరు ఆయన్ని ఒక చిన్న చేపగా అభివర్ణిస్తే, మరికొందరు మాత్రం తెరవెనుక చక్రం తిప్పే "కింగ్‌పిన్" అని విశ్లేషిస్తుంటారకాంట్రాక్టుల విషయానికి వస్తే, సృజన్ రెడ్డికి చెందిన సంస్థలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ప్రాజెక్టులను దక్కించుకున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల్లో ఆయన సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వేల కోట్ల విలువైన పనులు ఆయనకు దక్కాయని విపక్షాలు ఆరోపించేవి. అయితే, ప్రభుత్వం మారిన తర్వాత కూడా సృజన్ రెడ్డి హవా తగ్గకపోవడం గమనార్హం. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా ఆయనకు సంబంధించిన కంపెనీలు కొన్ని కాంట్రాక్టుల్లో పాలుపంచుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఏ పార్టీ అధికారంలో ఉన్నా, తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడంలో ఆయన చూపుతున్న నేర్పు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. నిజానికి సృజన్ రెడ్డి వంటి వ్యక్తులు రాజకీయాలకు, వ్యాపారాలకు మధ్య ఉండే వంతెన లాంటి వారు.

# కేబినెట్ లో కోల్డ్ వార్

## భట్టి వర్సెస్ కోమటిరెడ్డి

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

తెలంగాణలో సింగరేణి నైనీ బ్లాక్ టెండర్ల వ్యవహారం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. ఈ వ్యవహారం కేవలం ఒక టెండర్ రద్దుకు పరిమితం కాకుండా, ప్రభుత్వంలోని అంతర్గత కుమ్ములాటలను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. ఒక మీడియా సంస్థ బయటపెట్టిన ఈ డొల్లతనం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ తవ్వకాలకు సంబంధించి పిలిచిన టెండర్లలో సైట్ విజిట్ అనే నిబంధనను చేర్చడం వెనుక పెద్ద వ్యూహమే ఉందనేది తాజా ఆరోపణల సారాంశం. సాధారణంగా ఇలాంటి టెండర్లలో పారదర్శకత కోసం పోటీని ప్రోత్సహిస్తారు. కానీ, ఈ నిబంధన వల్ల ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతికి చెందిన కంపెనీకి మాత్రమే లబ్ధి చేకూర్చేలా నిబంధనలు రూపొందించారనే వార్తలు గుప్పుమన్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంధన శాఖ పరిధిలో జరిగిన ఈ ప్రక్రియపై విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. టెండర్లు రద్దు చేస్తూ భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రభుత్వ పారదర్శకతపై మచ్చ పడింది. వాస్తవానికి సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కంపెనీకి టెండర్ దక్కకుండా చేసేందుకే భట్టి విక్రమార్క ఈ నిబంధన తెరపైకి తెచ్చారనేది ఆరోపణ. అంటే రేవంత్ కేబినెట్ లోని ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్యపోరుకు ఇది నిదర్శనం. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించిన తీరు రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తన కేబినెట్ మంత్రుల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించాల్సింది పోయి, రేవంత్ రెడ్డి దీనిని రెండు మీడియా సంస్థల వార్ గా అభివర్ణించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. రెండు మీడియా హౌజ్‌ల గొడవలోకి మమ్మల్ని లాగొద్దు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగవనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి, ఇది మీడియా సంస్థల మధ్య గొడవ కాదు. తన కేబినెట్ లోని నెంబర్ 2 స్థానంలో ఉన్న మంత్రి తీసుకున్న నిర్ణయం తప్పు అని తెలిసినప్పుడు ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకుని సరిదిద్దాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపైన ఉంటుంది. కేబినెట్ లో ఇద్దరి మధ్య వివాదం రేగినప్పుడు, ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాలి. కానీ ఆ పని చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని స్పష్టమవుతోంది. నైనీ బ్లాక్ ఇష్యూలో ప్రభుత్వం ఇరకాటంలో పడడంతో, ప్రజల దృష్టిని మళ్లించడానికి పాత కేసులను తెరపైకి తెస్తున్నారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఇష్యూను మళ్ళీ చర్చల్లోకి తీసుకురావడం ద్వారా నైనీ బ్లాక్ వివాదాన్ని అణచివేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇది సమస్యను పరిష్కరించడం కాకుండా, కేవలం డ్యామేజ్ కంట్రోల్ కోసం చేస్తున్న రాజకీయ విన్యాసంగా కనిపిస్తోంది. నైనీ బ్లాక్ వ్యవహారం రేవంత్ రెడ్డి టీమ్‌లోని గందరగోళాన్ని బహిర్గతం చేసింది. కేబినెట్ లోని ఆధిపత్య పోరును సకాలంలో సర్దుబాటు చేయకపోవడం వల్లే ఇది ఇంతటి వివాదానికి దారితీసింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మీడియా చాటున దాక్కోకుండా, పాలనలో పారదర్శకతను, మంత్రుల మధ్య ఐక్యతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే డొల్లతనం అనే ముద్ర ప్రభుత్వానికి శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది.



# మేడారంలో బస్ స్టాండ్

వరంగల్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మిస్తామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క ప్రకటించారు. జాతర కోసం ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌లో 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. భక్తుల రద్దీని తట్టుకునేందుకు 4 వేల ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు, ఇవి ప్రయాణికులను నేరుగా గద్దెల సమీపం వరకు తీసుకెళ్తాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం మేడారం బస్సులకు కూడా వర్తిస్తుంది. అదనంగా.. ములుగులో రూ.5 కోట్లతో బస్టాండ్, ఏటూరునాగారంలో రూ.7 కోట్లతో బస్ డిపో నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ కుంభమేళాగా పిలవబడే మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం రవాణా శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ములుగు జిల్లా మేడారంలో పర్యటించిన రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ , పంచాయతీరాజ్ మంత్రి సీతక్క వనదేవతలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల రవాణా సౌకర్యాల కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌ను వారు ప్రారంభించారు. మేడారం జాతర సమయంలో భక్తుల రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ప్రతి ఏటా తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేస్తోంది. అయితే.. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మేడారంలో శాశ్వత బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం జాతర కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం 50 ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. దీనివల్ల ప్రయాణికులు తోపులాట లేకుండా క్రమపద్ధతిలో బస్సుల కోసం వేచి ఉండవచ్చు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే జాతర కోసం ప్రాథమికంగా 4 వేల బస్సులను కేటాయించారు. భక్తుల రద్దీ పెరిగితే ఈ సంఖ్యను మరింత పెంచుతామని మంత్రి తెలిపారు. సాధారణంగా జాతర సమయంలో వాహనాలను దూరంగా నిలిపివేస్తారు.. కానీ ఆర్టీసీ బస్సులను మాత్రం భక్తుల సౌకర్యార్థం గద్దెల సమీపం వరకు అనుమతిస్తారు. మేడారం పరిసర ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను బలోపేతం చేయడానికి ములుగులో రూ. 5 కోట్లతో అత్యాధునిక బస్టాండ్‌ను, ఏటూరునాగారంలో రూ. 7 కోట్లతో కొత్త బస్‌డిపోను నిర్మిస్తున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం మేడారం జాతరకు వచ్చే మహిళా భక్తులకు కూడా వర్తిస్తుంది. అంటే మహిళలు ఉచితంగా బస్సుల్లో మేడారం చేరుకోవచ్చు. మరోవైపు.. మేడారంలో భక్తులు అమ్మవార్లకు సమర్పించే బెల్లం (బంగారం) విషయంలో కొన్ని ఆంక్షలు అమలులో ఉన్నాయి. గుడుంబా తయారీకి బెల్లం తరలిపోకుండా ఉండాలని ఎక్సైజ్ అధికారులు ఆధార్ కార్డు వివరాలు అడుగుతున్నారు.




# అంత పెద్ద శిక్షా..

## ఆవేదనలో ఖమ్మం టీచర్

ఖమ్మం, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ పాఠశాల ఇంగ్లీష్ టీచర్ గౌతమి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వ్యవహారం వివాదాస్పదమైంది. పాఠశాల పనివేళల్లో పాఠాలు చెప్పకుండా.. ప్రైవేటు సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ వీడియోలు తీసినందుకు అధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. ఈ చర్యపై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ మరో వీడియో విడుదల చేశారు. 'నేనేమీ గంజాయి అమ్మలేదు, ఎవరినీ చంపలేదు.. తెలియక చేసిన తప్పుకు ఇంతలా ట్రోలింగ్ చేస్తారా?" అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా ఉంటామని అధికారులు హెచ్చరించగా.. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సోషల్ మీడియా మోజులో పడటం సరికాదని నెటిజన్లుఅభిప్రాయపడుతున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాల గదిని సోషల్ మీడియా వేదికగా మార్చుకున్నారనే ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయురాలు గౌతమి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే కారణంతో విద్యాశాఖ అధికారుల నుంచి కఠిన చర్యలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారు ఎలాంటి ప్రైవేటు వ్యాపార ప్రకటనల్లో నటించకూడదు. కానీ.. గౌతమి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పలు ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ రీల్స్ చేశారనే ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా పాఠశాల పని వేళల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా సోషల్ మీడియా పనుల్లో నిమగ్నమవ్వడంపై ఉన్నతాధికారులు గతంలోనే ఆమెను హెచ్చరించారు. అయినప్పటికీ ఆమె తీరులో మార్పు రాకపోవడంతో.. విధి నిర్వహణలో క్రమశిక్షణారాహిత్యం కింద ఆమెను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ వార్త బయటకు వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్‌పై గౌతమి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాజాగా ఆమె మరో వీడియో విడుదల చేస్తూ తన గోడు వెళ్లబోసుకున్నారు. 'నేనేమైనా గంజాయి విక్రయించానా..? లేక ఎవరినైనా హత్య చేశానా..? కేవలం తెలియక చేసిన చిన్న తప్పుకే నన్ను ఇంతలా అవమానిస్తారా..? అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. తనపై వస్తున్న విమర్శలను తట్టుకోలేకపోతున్నానని.. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన తప్పును క్షమించి తనకు మరో అవకాశం ఇవ్వాలని ఆమె అధికారులను వేడుకున్నారు. ఈ ఘటనపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ విధులను గాలికి వదిలేయడం తప్పని కొందరు అంటుంటే.. ఆమె ఆవేదనను గమనించి మానవతా దృక్పథంతో క్షమించాలని మరికొందరు కోరుతున్నారు. ఏదేమైనా.. విద్యావ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు సామాజిక మాధ్యమాల వినియోగంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన ఒక పాఠంగా నిలిచింది.

# కవితను కంట్రోల్ చేయడం ఎలా

అదిలాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ కు పంటి కింద రాయిలా మారారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేసే విమర్శలకు కవిత కౌంటర్ ఇస్తున్నట్లు కనపడుతుంది. ముందుగా బీఆర్ఎస్ లో జరిగిన అవినీతిని బయటపెడుతూ కారు పార్టీని ఇరుకునపెట్టేలా ప్రయత్నిస్తున్నారు. ఏ విషయంలోనైనా సరే కవిత తన తండ్రి స్థాపించిన బీఆర్ఎస్ పార్టీ అని ఏ మాత్రం మొహమాటానికి పోవడం లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనేక అవినీతి పనులు జరిగాయని సాక్షాత్తూ కవిత చేస్తున్న ఆరోపణలకు బీఆర్ఎస్ నుంచి సరైన సమాధానమే రావడం లేదు. కవితను ఎంతగా పట్టించుకోకుండా వదిలేయాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నప్పటికీ ఆమె చేసే ఆరోపణలు మాత్రం పార్టీని డ్యామేజీ చేస్తున్నాయని చెప్పక తప్పదు. తాజాగా సింగరేణి కాంట్రాక్టులపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు కూడా బీఆర్ఎస్ ను ఇరుకున పెట్టాయి. మేఘా అనే తిమింగలాన్ని రక్షించేందుకు బీఆర్ఎస్ చిన్న చేప చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికులకు కష్టం వస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పట్టించుకోవటం లేదని, పెద్ద కాంట్రాక్టర్ ను కాపాడేందుకు గుంటనక్క ప్రయత్నం చేస్తోందన్నారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ తప్పులే చేయనట్లు మాట్లాడటం విచిత్రంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. . గత బీఆర్ఎస్ ప్రభుత్వం లోనే సృజన్ రెడ్డికి సింగరేణి కాంట్రాక్ట్ లు ఇచ్చారని, అప్పుడు రేవంత్ రెడ్డి బావమరది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ చేసిన విమర్శలకు విలువ లేకుండా పోతుంది. కవిత లక్ష్యం హరీశ్ రావు, సంతోష్ రావులు కావచ్చు. తన తండ్రి కేసీఆర్ కు రాసిన బహిరంగ లేఖ బయటకు రావడానికి వారే కారణమని భావించడంతో పాటు తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంలో వీరి ప్రమేయం ఉందని గట్టిగా నమ్ముతున్న కవిత వారిని వదిలిపెట్టేలా కనిపించడం లేదు. కవిత విమర్శలు ఏ మాత్రం ప్రభావం చూపవని అనుకోవడం తప్పే అవుతుంది. కేసీఆర్ కుమార్తెగా ఆమె బీఆర్ఎస్ చేసే ఆరోపణలపై చాలా ప్రభావం ఉంటుందని నేతలు ఇప్పటికే భయపడిపోతున్నారు. కవితను కంట్రోల్ చేయడానికి కేసీఆర్ ఇప్పటి వరకూ ప్రయత్నం చేయకపోవడంతో ఇక రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సయితం బీఆర్ఎస్ కు నష్టం చేకూరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# 400 కోట్ల బ్లాక్ మనీ..

బెంగళూరు, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

కర్ణాటక-గోవా సరిహద్దులోని చోర్లా ఘాట్ అడవుల్లో గతేడాది అక్టోబరులో జరిగిన ఓ చోరీ ఘటన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. గోవా నుంచి కర్ణాటక మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్న రెండు భారీ కంటైనర్లను గుర్తుతెలియని ముఠా అడ్డుకుని, అందులోని భారీ నగదును దోచుకెళ్లింది. శ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ దోపిడీ జరిగిన మూడు నెలల వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఇటీవల నాసిక్‌కు చెందిన సందీప్ పాటిల్ అనే వ్యక్తి తాను కిడ్నాప్‌కు గురయ్యానని, దోపిడీ గురించి తెలుసుకున్నందుకే తనను బంధించారని ఫిర్యాదు చేయడంతో ఈ మెగా ధూమ్ దోపిడి బయటపడింది. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న మహారాష్ట్ర ప్రభుత్వం ఎస్పీ స్థాయి అధికారినేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా బెల్గాం పోలీసులు కూడా ఈ విచారణలో చేరారు. మూడు రాష్ట్రాల పోలీసులు ఇప్పుడు ఆ మాయమైన కంటైనర్ల కోసం అడవులను జల్లెడ పడుతున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఒక హవాలా ఆపరేటర్‌తో సహా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ దోపిడీ వెనుక కేవలం దొంగలే కాదు, కొందరు పోలీసు అధికారులు , ఒక ప్రముఖ మత గురువు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కంటైనర్లను అడ్డుకున్న ముఠాకు పోలీసులే సహకరించారని, అసలు బాధితుడు ఎవరో కూడా స్పష్టంగా తెలియకుండా జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. థానేకు చెందిన ఒక బిల్డర్‌కు చెందిన పాత నోట్లను మార్పిడి చేసే క్రమంలో ఈ దోపిడీ జరిగినట్లు సిట్ అనుమానిస్తోంది. అయితే బాధితుడు బయటకు వచ్చి ఫిర్యాదు చేయకపోవడం ఈ కేసులో అతిపెద్ద మిస్టరీగా మారింది. బెల్గాం పోలీసులు నాసిక్ వెళ్లి నిందితులను విచారించేందుకు అనుమతి కోరారు. అయితే, ఆ దోపిడీ నగదు నిజంగానే 400 కోట్లా లేక అంతకంటే ఎక్కు? అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. సంఘటనా స్థలం మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో, నిందితులు ఎక్కడ నగదును దాచారనే దానిపై క్లూస్ కోసం సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకూ బయటకు వచ్చిన సమాచారం చాలా తక్కువ. ఇంకా చాలా బయటకు రావాల్సి ఉంది. గుట్టుగా ముగిసిపోతుందా.. ప్రజలకు తెలిసేలా బయటపెడతారా అన్నది మాత్రం ఇంకా ఎవరికీ తెలియదు.

# రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపి చిన్ని

విజయవాడతూర్పు నియోజకవర్గం 4వ డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రోడు నిర్మాణ పనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేసారు. ×రూ.13 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం జరిగింది.

ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ రోజుకి యువనేత మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి మూడేళ్లు అవుతుంది. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ రాష్ట్రాన్ని రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర ద్వారా తెలుసుకున్న ప్రజల సమస్యల పరిష్కరించటానికి నిరంతరం కృషి చేస్తున్నారు. నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న మంత్రినారా లోకేష్ కు విజయవాడ ప్రజల తరుపున ధన్యవాదాలు. రాక్షస పాలన రాష్ట్రంలో పోయింది కానీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ లో పోలేదు. విజయవాడ అభివృద్ధికి సంబంధించిన డి.పి.ఆర్ లను మున్సిపల్ కౌన్సిల్ రిజెక్ట్ చేసింది. విజయవాడ అభివృద్ధికి విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ అడ్డుగా నిలబడుతోంది. ఈ నెల 31వ తేదీ లోపు డ్రింకింగ్ వాటర్, స్టామ్ వాటర్, డ్రైనేజీ అభివృద్ధికి సంబంధించిన డిపిఆర్ మా చేతికి అందనుంది. డిపిఆర్ రాగానే విజయవాడ నగరంలో నెలకొన్న పెద్ద సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తాం. రాణి గారి తోట వద్ద ఒక అండర్ పాస్ కి టెండర్ వేయటం జరిగింది. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో విజయవాడకి సంబంధించిన నేషనల్ హైవేస్, రైల్వే సమస్యలు ఒక కొలిక్కి వస్తాయి. విజయవాడ అభివృద్ధికి డిపిఆర్ సిద్ధం కాగానే ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు ను కలిసి మూడు వేల కోట్లు నిధులు కోరటం జరుగుతుంది.

# పిప్పిరి గ్రామం ఆదర్శంగా మార్పు

## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దత్తతతో అభివృద్ధి పరుగులు

### -సర్పంచ్ చొరవతో గ్రామంలో సమగ్ర మార్పులు

బజార్హత్నూర్, భారత శక్తి న్యూస్, జనవరి 27:

అభివృద్ధి వైపు పిప్పిరి గ్రామం పిప్పిరి అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అండతో పాటు గ్రామ సర్పంచ్ చొరవ ఫలితంగా పిప్పిరి గ్రామం నేడు ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకుంటోంది.

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారు కాంగ్రెస్ శాసనసభా పక్ష నేతగా ఉన్న సమయంలో నిర్వహించిన చారిత్రక పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బోథ్ నియోజకవర్గం బజార్హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం నుంచే ప్రారంభమైంది. అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే పిప్పిరి గ్రామాన్ని మోడల్ విలేజ్?గా అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఆ ఆదేశాల మేరకు గ్రామంలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఒకప్పుడు సామాన్య గ్రామంగా ఉన్న పిప్పిరి, నేడు ఆదర్శ గ్రామంగా మారుతోంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకున్నాయి.

నూతన పాలకవర్గం ఏర్పాటుతో సర్పంచ్ నేతృత్వంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. జిల్లాలోనే పిప్పిరి గ్రామాన్ని రోల్ మోడల్?గా నిలబెట్టాలనే లక్ష్యంతో పాలకవర్గం కృషి చేస్తోంది.

సర్పంచ్ దూరదృష్టితో విద్య, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పాఠశాలల ఆధునీకరణ, అంగన్వాడీ కేంద్రాల బలోపేతం, ఆరోగ్య ఉపకేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు.

వ్యవసాయంపై ఆధారపడిన ఈ గ్రామంలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భవిష్యత్తులో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీని వల్ల రైతులు, రైతు కూలీలకు సంవత్సరం పొడవునా ఉపాధి లభించే అవకాశం ఉంది. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలవడంతో పొలాల అభివృద్ధి, నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఫలితంగా ఎండాకాలంలో కూడా నీటి లభ్యత పెరిగి వలసలు గణనీయంగా తగ్గాయి.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి దత్తతపై, గ్రామ సర్పంచ్?పై గ్రామస్తుల్లో విశ్వాసం మరింత పెరిగింది. ఉపముఖ్యమంత్రి దత్తతతో తమ ఊరి రూపురేఖలు పూర్తిగా మారాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# గర్భిణీ కి సకాలంలో ఏ పాజిటివ్ రక్తం అందజేత

### -41 వ సారి రక్తదానం చేసిన రవికుమార్
### -ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 27: మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ శాఖని మీనా (28) అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో,వారికి కావలసిన రక్తం దొరకకపోవడంతో దోమకొండ మండల కేంద్రానికి చెందిన లక్కబత్తిని రవికుమార్ మానవతా దృక్పథంతో స్పందించి 41 వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు.



ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, రవికుమార్ ప్రతి సంవత్సరం నాలుగు సార్లు రక్తదానంతో పాటుగా మూడు నుండి నాలుగు సార్లు తెల్ల రక్త కణాలను అందజేస్తూ ప్రాణదాతగా నిలుస్తున్నారని, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ మానవత్వాన్ని చాటుతున్న రక్తదాత రవికుమార్ ను అభినందించడం జరిగింది. ఆపదలో ఉన్న వారికి కావాల్సిన రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని రక్త దానం చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు.

# గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'ఎట్ హోమ్' కార్యక్రమం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 27 (భారత శక్తి): జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు ఆప్యాయంగా స్వాగతం పలికారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తమ ఆహ్వానం మేరకు ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరైన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం, సహోదర భావం మరింత బలపడుతుందని అన్నారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్ఞాపికలను అందజేశారు. అలాగే అతిథులందరికీ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీవాణి, జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గాయత్రీ కళాశాల యందు స్వదేశీ వస్తువుల వాడకం కోసం అవగాహన

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 27: కామారెడ్డిలో మంగళవారం ఉదయం స్థానిక గాయత్రీ కళాశాల యందు స్వదేశీ వస్తువుల వాడకం కోసం అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయడంతో పాటు పరుగు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్వదేశీ వస్తువులను వాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధి లో యువత భాగస్వామ్యం కావాలని కోరుతూ అవగాహన కల్పించారు. ఏది స్వదేశీ ఏది విదేశీ అని తెలిపే కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా బాధ్యులు మహేష్ రెడ్డి, జంగం నరేష్, మన్నే కృష్ణ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# గీతంలో బిగ్ డేటా అనలిటిక్స్ పై కార్యశాల

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఎంటెక్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల 'బిగ్ డేటా అనలిటిక్స్: ఆచరణాత్మక శిక్షణ' మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యశాలను ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ నిర్వహిస్తుండగా, నాగపూర్ ప్రభుత్వ కళాశాలలోని సీఎస్ఈ విభాగం ఆచార్యుడు డాక్టర్ కమలాకాంత్ లక్షణ్ బవాంకులే ప్రధాన వక్తగా పాల్గొంటున్నారు. హడూప్ ఉపయోగించి డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్ పై విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు. ఈ శిక్షణలో భాగంగా, ప్రాథమిక భావనలు, సిస్టమ్ రూపకల్పన, ఆచణాత్మక వ్యాయామాలపై దృష్టి సారిస్తున్నారు. ఇందులో పాల్గొనేవారు బిగ్ డేటా ప్రాసెసింగ్, డిస్ట్రిబ్యూటెడ్ సిస్టమ్ డిజైన్ పై సమగ్ర అవగాహన పొందుతారని తెలియజేశారు.



# కామారెడ్డిలో కాంగ్రెస్ జోరు, షబ్బీర్ అలీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన కార్యకర్తలు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 27: అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పై కామారెడ్డి పట్టణ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.


పట్టణంలోని 22వ, 25వ వార్డులకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి షబ్బీర్ అలీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అభివృద్ధి బాటలో, కామారెడ్డి నియోజకవర్గ రూపురేఖలు మారాలన్నా, మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా అది కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, షబ్బీర్ అలీ పర్యవేక్షణలోనే సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

గత పదేళ్లలో జరగని అభివృద్ధి ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో పట్టాలెక్కుతోందని వారు కొనియాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యకర్తలు, షబ్బీర్ అలీ నిలబెట్టిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. 22, 25 వార్డులతో పాటు పట్టణంలోని అన్ని వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కామారెడ్డి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి, ఆ విజయాన్ని షబ్బీర్ అలీకి కానుకగా ఇస్తామని కార్యకర్తలు నినదించారు"కామారెడ్డిని అభివృద్ధి పథంలో నిలపడం షబ్బీర్ అలీ కే సాధ్యం. రేవంత్ రెడ్డి పాలనలో నిధుల వరద పారుతోందని తెలిపారు. ఈసారి మున్సిపాలిటీ మనదే!" అని స్థానిక నాయకులు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో గురుకుల శ్రీనివాస్, సిద్ధిఖ్, భాను ప్రసాద్, యూనిస్,భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వార్డు ఇన్చార్జులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 27: నామినేషన్ స్వీకరణ జనవరి 28 వ తేదీ నుండి జనవరి 30వ తేదీ వరకు మునిసిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు రెండవ సాధారణ ఎన్నికలు 2026 రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లకు సాధారణ ఎన్నికలు--2026 నిర్వహించేందుకు ఎన్నికల షెడ్యూల్?ను ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ లు, సంబంధిత అధికారులతో ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జీ కలెక్టర్ ఇలా త్రిపాఠి, కామారెడ్డి ఎసీఎల్ బి మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, మున్సిపల్ కమిషనర్ లు నిజామాబాద్ కలెక్టరేట్ నుండి హాజరుకాగా, కామారెడ్డి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, జెడ్పీ సీఈఓ చందర్ , సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎమ్ సి సి) తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలియజేయడమైనది.

ఎన్నికల షెడ్యూల్ ముఖ్యాంశాలు:

నామినేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ:28.01.2026 (బుధవారం)

(ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు)

నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ: 30.01.2026లి (శుక్రవారం)

(సాయంత్రం 5.00 గంటల వరకు)

నామినేషన్ల పరిశీలన తేదీ: 31.01.2026లి (శనివారం)

(ఉదయం 11.00 గంటల నుండి)

చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితా ప్రచురణలి : 31.01.2026 (శనివారం)

(పరిశీలన పూర్తయిన వెంటనే)

అప్పీల్ దాఖలు చేసుకునే చివరి తేదీ: 01.02.2026లి (ఆదివారం)

(సాయంత్రం 5.00 గంటల వరకు)

అప్పీల్స్ పరిష్కార తేదీ: 02.02.2026 ( సోమవారం)

(సాయంత్రం 5.00 గంటలకు ముందు)

నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ: 03.02.2026 (లి మంగళవారం)

(మధ్యాహ్నం 3.00 గంటల వరకు)

తుది అభ్యర్థుల జాబితా ప్రచురణ: 03.02.2026లి (మంగళవారం)

(మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత)

లిపోలింగ్ తేదీ: 11.02.2026 (బుధవారం)లి

(ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు)

రీ-పోల్ (ఉండినట్లయితే): 12.02.2026 (గురువారం)

లిలిఓట్ల లెక్కింపు తేదీ: 13.02.2026 (శుక్రవారం)

(ఉదయం 8.00 గంటల నుండి )

ఫలితాల ప్రకటన: ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే

ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు , ప్రజలు సంపూర్ణ సహకారం అందించి ఎన్నికలను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని అన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎమ్ సి సి) తక్షణమే అమల్లోకి వచ్చింది.

ఎంసీసీ అమలులో ఉన్న కాలంలో ఎలాంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు అధికారులు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, అదేవిధంగా, పట్టణ పరిధిలో ఉన్న అన్ని రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు, ఇతర అభ్యంతరకరమైన ప్రచార సామగ్రిని వెంటనే తొలగించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించనైనది.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చట్ట ఉల్లంఘన తగదు

## ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన డాక్టర్ అర్షియా సేథి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27: చట్టాలను మనం గౌరవిస్తే, అవి మనకు చట్టపరమైన




రక్షణలను కల్పిస్తాయని, చట్ట ఉల్లంఘన తగదని ఫుల్ బ్రైట్ ఫెలో (రెండుసార్లు), విద్యావేత్త, కేఆర్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, అన్ మ్యూట్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ అర్షియా సేథి స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళలు విభాగం ఆధ్వర్యంలో 'మౌనాన్ని వీడడం: నేటి భారతదేశంలో కళలు, చట్టం' అనే అంశంపై ఆమె మంగళవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు.డాక్టర్ సేథీ మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) గురించి సమగ్రమైన అవలోకనాన్ని అందించారు. ముఖ్యంగా సాహిత్య, సంగీత రచనలలో కాపీరైట్, భౌగోళిక సూచనలు (జీఐ), సంబంధిత మినహాయింపులపై దృష్టి సారించి, అనేక చారిత్రాత్మక న్యాయ కేసుల ద్వారా తన వాదనలను వినిపించారు. ఐపీఆర్ అనేవి పారిశ్రామిక, శాస్త్రీయ, సాహిత్య, కళా రంగాలలో మేధో కార్యకలాపాల నుంచి ఉత్పన్నమయ్యే సృజనలను రక్షించే చట్టపరమైన హక్కులని ఆమె వివరించారు. ఉద్యోగ కల్పన, ఆదాయ సృష్టి, ఆర్థిక వృద్ధిలో వాటి కీలక పాత్రను ఆమె విశదీకరించారు.డాక్టర్ సేథీ కాపీరైట్, ట్రేడ్ మార్కులు, సాహిత్య దొంగతనం, పైరసీ వంటి మేధో సంపత్తి హక్కుల ముఖ్య రూపాలను వివరించారు. అలాగే, ప్రింట్, కొత్త మీడియా, కళలు, ప్రసార మాధ్యమాలు, చలనచిత్రాలు, నాటక కళలు, సంగీతం వంటి రంగాలను సృజిస్తూ, 1957 కాపీరైట్ చట్టం, దాని 2012 సవరణల గురించి చెప్పారు. కాపీరైట్ ను 'హక్కుల సమూహం'గా ఆమె అభిర్ణించారు. ప్రచురించిన, ప్రచురించని అసలైన రచనలకు ఇది వర్తిస్తుందని, ఇందులో సానుకూల, ప్రతికూల హక్కులుంటాయని చెప్పారు. కష్టం, సృజనాత్మకత సూత్రాలతో పాటు వాస్తవికత యొక్క పరీక్షలను ఆమె వివరించారు.కళా సంప్రదాయాలలో గురువుల హక్కులను, రచనలు గౌరవం పొందుతున్నప్పటికీ, ఏ వ్యక్తి కూడా ఒక కళారూపంపై గుత్తాధిపత్యాన్ని హక్కును కోరలేరని డాక్టర్ సేథీ స్పష్టీకరించారు. కాపీరైట్ కు మినహాయింపులను వివరిస్తూ, కళాకారుల నైతిక హక్కులు, క్రియేటివ్ కామన్స్, సక్రమ వినియోగం, కాపీరైట్ గడువు తీరిపోవడం వంటి అంశాలను డాక్టర్ సేథీ చర్చించారు.తొలుత, కార్యక్రమ సమన్వయకర్త వైష్ణవి అతిథిని స్వాగతించి, సభికులకు పరిచయం చేశారు. లలిత, ప్రదర్శన కళల విభాగానికి చెందిన డాక్టర్ లలిత సింధూరి, డాక్టర్ ఆదిశేషయ్య అతిథిని జ్ఞాపికతో సత్కరించారు.

# నేడు మొబైల్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27:

జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆదేశాల మేరకు...గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడకు చెందిన గ్రాన్యువల్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఏఐజి ఆసుపత్రి సహకారంతో వైద్య ఆరోగ్యశాఖ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సమన్వయంతో సంగారెడ్డి జిల్లాలో మొబైల్ బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 30 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ బెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఆక్టివ్ కేసుల గుర్తింపు, క్యాన్సర్ నిర్ధారణ, మామోగ్రఫి, క్యాన్సర్ వ్యాధిపై ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా ముందుకెళ్లనుంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే మొబైల్ క్లినిక్ జిల్లాలోని అన్ని గ్రామాలను సందర్శించేలా కార్యక్రమాలను రూపొందించనున్నారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు అర్హులైన మహిళలను బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు హాజరయ్యే విధంగా ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు కంది లోని ఎస్ ఎస్ గార్డెన్స్ లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ ఇవ్వండి: ఏపీయూడబ్ల్యూజే డిమాండ్

అనంతపురం భారత శక్తి ప్రతినిధి,జనవరి 27:

కరువుకు నిలయమైన జిల్లాలో చాలా మంది సీనియర్ జర్నలిస్టులు, ఔత్సాహిక జర్నలిస్టులు సొంత పత్రికలు ఏర్పాటు చేసుకుని వాటి నిర్వహణతో సామాజిక సేవ చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నారని, ఈ నేపథ్యంలో అక్రిడిటేషన్ జీవో నిబంధనలను సడలించి మీకున్న విశేష అధికారాలతో జిల్లా అక్రిడేషన్ కమిటీ ఆమోదంతో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( ఏపీయూడబ్ల్యూజే) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ , కార్యదర్శి షేక్ మహమ్మద్ అయూబ్ ల నేతృత్వంలో



జర్నలిస్టులు మంగళవారం ఇంచార్జ్ కలెక్టర్ విష్ణు చరణ్ ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లావ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో పాటు అనేకమంది జర్నలిస్టులు చిన్న, మధ్యతరహా పత్రికలు అడుక్కుంటూ స్మాల్ అండ్ మీడియం విభాగంలో పనిచేస్తున్నారని ఇన్చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

లిసానుకూలంగా స్పందించిన ఇంచార్జ్ కలెక్టర్లి

ఏపీయూడబ్ల్యూజే విన్నపం పట్ల ఇంచార్జ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీకి సంబంధించి సభ్యుల నియామక ప్రక్రియ ముగియడంతో త్వరలోనే కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. దీనిపై ఐఅండ్ పీఆర్ ఏడితో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల మంజూరుకు సంబంధించిన వివరాలన్నీ చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జాతీయ కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ కుమార్, పూలశెట్టి చలపతి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్ర నాథ్ రెడ్డి, జిల్లా కమిటీ అధ్యక్షుడు రసూల్, చిన్న పత్రికల సంఘం ప్రతినిధులు చౌడప్ప, డేవిడ్, బాబ్జన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు బివి రెడ్డి, ప్రజాభూమి స్టాఫ్ రిపోర్టర్ రాజా హెన్నూర్, జయరామిరెడ్డి, పలువురు ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సంగారెడ్డీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపుపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆందోళన

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27 :



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పటాన్చెరు మండలం కర్ధనూర్ గ్రామానికి తరలించాలన్న ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ఉ స్టాంప్స్, హౌసింగ్ ఉ ఐటీ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ లేఖ రాశారు. సంగారెడ్డీ జిల్లా కేంద్రం కావడంతో అన్ని జిల్లా స్థాయి కార్యాలయాలు ఇక్కడే కొనసాగాలని పరిపాలనా నిబంధనలు స్పష్టంగా పేర్కొంటున్నాయని ఆయన లేఖలో తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సంగారెడ్డిలో ఉండటం వల్ల ప్రజలకు సులభంగా అందుబాటులో ఉందని, దీనిని మారిస్తే వృద్ధులు, మహిళలు, రైతులు, దినసరి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యాలయం తరలింపుతో ప్రయాణ దూరం పెరిగి, అదనపు ఖర్చులు, సమయ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు.ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రజల ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడుతుందని, ప్రభుత్వ సేవల సాఫీగా అందడంలో ఆటంకాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.అందువల్ల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంగారెడ్డి నుంచే కొనసాగించేలా నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని మంత్రికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ లేఖ ప్రతిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్కు కూడా పంపించారు.

# చేతకాని/సిగ్గుమాలిన ప్రభుత్వ తప్పిదాలతో జనం అవస్థలు.. - సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకట శివ

కడప భారత శక్తి ప్రతినిధి, జనవరి 27 :

20 నెలలు గా కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యర్రముక్కపల్లె - బాకరాపేట రైల్వే బ్రిడ్జి రోడ్డు పనులు పెండింగ్ లో పడటం, ఏళ్ల తరబడి జనం తీవ్ర అవస్థలు పడటం దారుణమని, పెండింగ్ పనులను వెంటనే పరిపూర్తి చేయాలని సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ డిమాండ్ చేశారు.మంగళవారం కడప నగర సౌత్ జోన్,18 వ డివిజన్ జెవి నగర్ లో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించి రైల్ గేమ్ రైల్వే బ్రిడ్జి వరకు స్థానికులచే సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ కౌన్సిలర్, సిపిఐ సీనియర్ నాయకులు, ఐకాన్ విల్లాస్ వాసి పాలెం చెన్నకేశవరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు కిన్నెర నాగముని నగర్ వాస్తవ్యులు కిన్నెర నాగరాజు లు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వెంకట శివ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు అయితే , స్థానిక నేతలు అది వద్దని రైల్వే అండర్ బ్రిడ్జి కి అనుమతులు తీసుకొని రైల్వే టెండర్లు పిలిపించుకొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కడప, కమలాపురం ఎమ్మెల్యేలు అట్టహాసంగా ప్రారంభించిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ఎర్రముక్కపల్లి వైపు పూర్తయినా గాని, భాకరాపేట వైపు పనులు పూర్తి కాకపోవడం, ఇప్పటికీ అసలు భూ సేకరణ నే జరపకపోవడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి సంబంధిత ప్రాంతాల ప్రజానికం రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నప్పటికీ జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సకాలంలో రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పనుల పరిపూర్తికి చిత్తశుద్ధితో కృషి చేయకపోవడం దారుణమన్నారు. నాడు లక్షల రూపాయలతో టిడిఆర్ బాండ్లు, నగదు తో ఇల్లులు కోల్పోతున్న బాధితులకు రాష్ట్ర పరిహారం చెల్లిస్తామన్నారు. నెల క్రితం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసి,కోట్ల రూపాయలతో భూ సేకరణకు అడ్డగోలుగా అధికార యంత్రాంగం వ్యవహరించేందుకు సిద్ధమవుతుండడం దారుణమన్నారు. భూసేకరణలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఇల్లు కోల్పోతున్న వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు పనులను నిర్దిష్ట కాలపరిమితితో పరిపూర్తి చేసి ప్రజల రాకపోకల కష్టాల కడగండ్లను తీర్చాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కడప నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, లోకసత్తా శ్రీకృష్ణ, ఈస్ట్ జోన్ సిపిఐ కార్యదర్శి పగడపూల మల్లికార్జున, వడ్ల భాగ్యలక్ష్మి, దగ్గుబాటి శీను, రాపూరి మధు తదితర సిపిఐ నాయకులు సంతకాలు సేకరించారు.


# సినిమా

## 'జన నాయగన్'కు మరోసారి చుక్కెదురు!



విజయ్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందిన 'జన నాయగన్' కు మరోసారి చుక్కెదురైంది. 'జన నాయగన్' యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. నేడు ఆ తీర్పును మద్రాసు హైకోర్టు పక్కనపెట్టింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని తిరిగి సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది. సెన్సార్ బోర్డుకు తన వాదనలు వినిపించడానికి న్యాయపరమైన అవకాశాలు ఇవ్వాలని మద్రాసు హైకోర్టు పేర్కొంది. అలాగే, ఈ వ్యవహారాన్ని రివైజింగ్ కమిటీకి పంపిన నిర్ణయం సరైనదా కాదా.. అనే అంశాన్ని సింగిల్ జడ్జి స్వేచ్ఛగా పరిశీలించి నిర్ణయం తీసుకోవచ్చని హైకోర్టు పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తగినవిధంగా మరోసారి విచారణ చేసి ఆదేశాలు జారీ చేసే అధికారం సింగిల్ బెంచ్‌కు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ సినిమా విడుదల మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జన నాయగన్‌కు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు జనవరి 9న మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీని విడుదల విషయంలో జోక్యానికి నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం మద్రాసు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాలని నిర్మాతలకు సూచించింది. జనవరి 21న సుదీర్ఘ వాదనల అనంతరం డివిజన్ బెంచ్ తీర్పును రిజర్వ్ చేసింది. మరోసారి విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని నేడు సింగిల్ బెంచ్‌ను ఆదేశించింది.

## ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. 'దేవర 2' అప్‌డేట్ ఇచ్చిన నిర్మాత



ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'. 2024లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దీనిపై పెద్దగా అప్‌డేట్స్ రాకపోవడంతో నెట్టింట రకరకాల వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత సుధాకర్ ఓ కార్యక్రమంలో 'దేవర 2' అప్‌డేట్ పంచుకున్నారు. ఈ ఏడాది మేలో దీని సీక్వెల్ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'దేవర' విడుదలై ఏడాదైన సందర్భంగా గతేడాది సెప్టెంబర్‌లో నిర్మాణసంస్థ ఈ సీక్వెల్‌పై ఓ పోస్ట్ పెట్టింది. "ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. 'దేవర 2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి" అని పేర్కొంది. 'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఆయన వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు.

## దీపికా పదుకొణె నా లక్కీ ఛార్మ్.. 'ఏఏ 22'పై అట్లీ ఆసక్తికర వ్యాఖ్యలు

అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ ఓ భారీ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏఏ 22' వర్కింగ్ టైటిల్. ఎంతో బిజీగా ఉన్న ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఆ సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ మూవీ హీరోయిన్ దీపికా పదుకొణె తన లక్కీ ఛార్మ్ అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో దీపిక చాలా కొత్తగా కనిపిస్తారని, ఆమె నటన కట్టిపడేస్తుందంటూ కొనియాడారు. షారుక్‌ఖాన్ దీపిక ప్రధాన పాత్రల్లో అట్లీ తెరకెక్కించిన 'జవాన్' ఘన విజయం సాధించిన విషయం విదితమే. 'ఏఏ 22' అప్‌డేట్ ఇవ్వలేదుగానీ ప్రేక్షకులకు కొత్త అనుభూతి పంచేందుకు తన టీమ్ ఎంత కష్టపడుతుందన్న అంశాన్ని అట్లీ వివరించారు. మేకింగ్ పరంగా ప్రతిరోజూ కొత్త విషయాలు తెలుసుకుంటున్నానన్నారు.


## హ్యాపీకి 20 ఏండ్లు



తెలుగు యువతను ఒక ఊపు ఊపిన చిత్రాల్లో 'హ్యాపీ' ఒకటి. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మూవీ కెరీర్‌లో క్లాసిక్ హిట్‌గా నిలిచింది. ఇందులో బన్నీ డ్యాన్స్ కు అభిమానులు ఫిదా అయ్యారు. టి. కరుణాకరన్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా విడుదలై నేటితో 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఒక ఎమోషనల్ పోస్టును షేర్ చేస్తూ మధుర జ్ఞాపకాలను పంచుకున్నాడు. 'నా కెరీర్‌లో అత్యంత ఆనందాన్ని ఇచ్చిన సినిమాల్లో 'హ్యాపీ' ఒకటి. అద్భుతమైన విజన్‌తో ఈ కథను తెరకెక్కించిన దర్శకుడు ఎ. కరుణాకరన్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా సహనటి జెనీలియా, విలక్షణ నటుడు మనోజ్ బాజ్‌పేయ్, అలాగే ఇతర నటీనటులు ఈ సినిమాను నిజంగా ఒక ఆనందకర ప్రయాణంగా మార్చారు. ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌యువన్ శంకర్ రాజా ప్రాణం పోశారు. సినిమా కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క సాంకేతిక నిపుణుడికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ ప్రాజెక్ట్‌కు బలంగా నిలిచిన నా తండ్రి అల్లు అరవింద్ గారు, ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ కు స్పెషల్‌థాంక్స్. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణే ఈ సినిమాను చిరస్మరణీయంగా నిలిపింది' అంటూ ఆనాటి మెమోరీస్‌ను గుర్తుచేసుకున్నాడు.



## డబ్బింగ్ బిగిన్స్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయ్యింది. వీలైనంత త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ మూవీ టీం సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. దీనిని ఈ ఏడాది మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందలో పోలీస్ ఆఫీసర్‌గా పవన్ స్టైలిష్ కనిపించనున్నాడు.. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్‌అందిస్తున్నాడు. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్దలైపోద్ది' అంటూ ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమా రేంజ్‌ను చెప్పకనే చెప్పగా, ఇప్పుడు డబ్బింగ్ పనులు మొదలవ్వడం సినిమా విడుదలకు అడుగులు వేగంగా పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది. ఇక 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత పవన్, హరీశ్ శంకర్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

## మాటల్లేవ్


### ఆసక్తికరంగా విజయ్ సేతుపతి 'గాంధీ టాక్స్' ట్రైలర్




మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటించిన లేటెస్ట్‌మూవీ 'గాంధీ టాక్స్'. కిశోర్ పాండురంగ్ బేలేకర్ తెరకెక్కిస్తున్న ఈమూవీలో అదితి రావు హైదరీ, అరవింద్ స్వామి, సిద్ధార్థ్ జాదవ్, మహేశ్ మంజ్రేకర్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. డైలాగులు లేని మూకీ సినిమాగా ఇది రూపుదిద్దుకోవడం విశేషం. ప్రకటించిన రోజు నుంచే అందరిలో ఆసక్తిని కలిగించిన ఈ మూవీ ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రతి స్టోరీకి మాటలు అవసరం లేదు.. కొన్ని దృశ్యాలు చూడడంతోనే మనసుకు హత్తుకుంటాయి. ఈ సారి స్క్రీన్‌పై మాటలు ఉండవు.. అది మిమ్మల్ని వినేలా మాత్రమే చేస్తుంది' అంటూ చెబుతున్న డైలాగ్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నటీనటుల యాక్టింగ్‌తో పాటు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా నిలవనుంది.

## ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉంది.. చిరంజీవి వ్యాఖ్యలపై గాయని చిన్మయి స్పందన!

ఇండస్ట్రీలో కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని.. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవని చిరంజీవి కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ అంశంపై గాయని చిన్మయి స్పందించారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇండస్ట్రీలో నిబద్ధత అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. "సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్త వారికి అవకాశాలు రావు. సాధారణంగా



కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అనే అర్థం. కానీ, ఇండస్ట్రీలో మాత్రం దాని అర్థం వేరు. కొందరు పురుషులు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇండస్ట్రీలో ఎదురైన చేదు అనుభవాలకు భయపడి ఈ రంగాన్నే వదిలివెళ్లిపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంతోమంది ఇక్కడ వేదికలపై స్పీచ్‌లు ఇస్తూనే ఉన్నారు" అని చిన్మయి తెలిపారు. తాను కూడా గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దాయన తనతో తప్పుగా ప్రవర్తించాడని అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి ఓ లెజెండ్ అని ఆమె అన్నారు. ఆయన తరంలో నటీనటులంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఉండేవారని.. పరస్పరం గౌరవించుకునే వారని చెప్పారు. లెజెండ్‌లతో కలిసి వర్క్ చేసిన వారు కూడా తన దృష్టిలో గొప్పవారేనని చిన్మయి తెలిపారు.

ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి ఇండస్ట్రీ గురించి మాట్లాడారు. 'సినీ ఇండస్ట్రీ అద్దంలాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితమే వస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్ట్రీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలు ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు . నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం దిశా నిర్దేశం

* **మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధం**
* **జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, జనవరి 27: రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగాలంటే ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలు అన్నింటినీ తూచా తప్పకుండా పాటించాలన్నారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లతో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు జిల్లా



యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లాలో 11 మున్సిపాలిటీలలోని 256 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలు సిద్ధం చేశామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. నోడల్ అధికారులు తమ తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. నామినేషన్ సెంటర్లలోని అన్ని గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అలాగే నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. నోటిఫికేషన్ వెలువడినందున వెంటనే ఎంసీసీని అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికల సందర్భంగా సీజ్‌ర్లు, రోజువారి నివేదికలు తదితర అంశాల్లో పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, జోనల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాలను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.



## రాక్ టౌన్ కాలనీలో
# ఘనంగా గణతంత్ర వేడుకలు

* **ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి.సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ చింతల.అరుణ సురేందర్ యాదవ్.**

ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి): రాక్ టౌన్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కాలనీ వాసులకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు.

**అభివృద్ధిలో ఆదర్శం.. రాక్ టౌన్:**

అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. రాక్ టౌన్ కాలనీ సభ్యులందరూ ఐకమత్యంతో ఉంటూ అభివృద్ధి పనుల్లో ముందుండటం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ అన్ని పండుగలను కలిసికట్టుగా నిర్వహించుకోవడం ఆదర్శనీయమని కొనియాడారు. ఇప్పటికే కాలనీలో ప్రధానమైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని, పెండింగ్‌లో ఉన్న పార్కుల అభివృద్ధి, స్పోర్ట్స్ ఫెసిలిటీస్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

* **ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం:**

ఇటీవల సంక్రాంతి సందర్భంగా కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు, యువతులకు మరియు మహిళలకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను కాలనీకి చెందిన పెండం కృష్ణ కుమార్ స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ కాలనీ ప్రెసిడెంట్ ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. వేడుకల్లో భారీ సంఖ్యలో పాల్గొన్న కాలనీ సభ్యులకు, మహిళలకు, పిల్లలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పరిసర కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల భేటీపై అసత్య ప్రచారం సరికాదు: మంత్రి

మంత్రుల భేటీపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తీవ్రంగా ఖండించారు. ప్రతి చర్చను "రహస్య భేటీ"గా చిత్రీకరించడం తగదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో క్యాబినెట్ ఒక యూనిట్ అని పేర్కొన్న ఆయన.. పరిపాలనాపరమైన చర్చల్లో తప్పేముందని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో పాలన అంశాలపై చర్చించామని స్పష్టం చేశారు. లోక్ భవన్‌లో జరిగిన ఎట్ హోమ్ కార్యక్రమం తర్వాత అందరి ముందే ఒకే కారులో వెళ్లామని చెప్పారు. అయినా ఏదో రహస్య భేటీ అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై పార్టీ వ్యూహాలపై చర్చ సహజమేనని చెప్పారు. ఎన్నికలకు సిద్ధం కావడం రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని వ్యాఖ్యానించారు. రాజకీయ లబ్ధి కోసమే




కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నిర్మాణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని, కానీ వ్యక్తిత్వ హననం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభిప్రాయపడ్డారు. అసత్య ప్రచారాన్ని మానేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటీవలి కాలంలో సింగరేణి కాంట్రాక్టులతో పాటు వివిధ అంశాల్లో మంత్రుల మధ్య బేధాభిప్రాయాలు ఉన్నట్లు తీవ్ర ప్రచారం జరిగింది. అందుకు తగ్గట్లుగానే మీడియాలో కథనాలు, విలేకరుల సమావేశాలు వరుసగా జరిగాయి. ఈ క్రమంలో పాత కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులపై ముఖ్యమంత్రి కక్ష గట్టారని, వారిని మంత్రివర్గం నుంచి సాగనంపేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. అంతలో దావోస్ పర్యటన నిమిత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశాలకు వెళ్లిపోయారు. రిపబ్లిక్ డే సందర్భంగా జెండావిష్కరణ అనంతరం లోక్‌భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమానికి పలువురు మంత్రులు హాజరయ్యారు. ఆ తరువాత నలుగురు మంత్రులు కలిసి ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. దీనిపై మంత్రుల రహస్య భేటీ అంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో శ్రీధర్‌బాబు వివరణ ఇచ్చారు.

# ఖైరతాబాద్ లో నాలుగేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడి

హైదరాబాద్ నగరంలో వీధికుక్కల స్వైర విహారం కొనసాగుతోంది. తాజాగా ఖైరతాబాద్ లో నాలుగేళ్ల చిన్నారిపై వీధికుక్క దాడికి పాల్పడింది. శ్రీనివాస్‌నగర్‌లో నివాసముండే మల్లికార్జున్, రేవంతి దంపతుల కుమార్తె శార్వి ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో వీధికుక్క ఒక్కసారిగా పైకి దూకింది. ఈ దాడిలో చిన్నారి మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు బాలికను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. శార్వి ప్రస్తుతం రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ప్రస్తుతం అమ్మాయి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



ఒకవైపు వీధికుక్కల అంశంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు.. అనంతరం మేనకా గాంధీ, రేణుదేశాయ్, రశ్మి గౌతమ్ వంటి వారి కామెంట్లు తీవ్ర చర్చకు దారితీశాయి. ఒకవైపు వీధికుక్కల అంశంపై వాడిగా వేడిగా చర్చ జరుగుతుండగానే దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది.

# జీవన జ్యోతిర్లింగ శివాలయంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న మహాబలిపురం మరకత లింగం

జిన్నారం, భారత శక్తి ప్రతినిధి, జనవరి 27: జిన్నారం మున్సిపల్ కేంద్ర శివారులోని తాంబేలు గుట్టపై నూతనంగా నిర్మించిన జీవన జ్యోతిర్లింగ శివాలయంలో విగ్రహ ప్రతిష్టాపన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆలయంలో ప్రత్యేకంగా మరకత లింగం ప్రతిష్టాపన చేయాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. కాగా మహాబలిపురం నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన మరకత లింగం ఆలయంలో ప్రతిష్టిస్తే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఫిబ్రవరి 18 నుంచి 22 వరకు చేపట్టేందుకు కమిటీ సభ్యులు, పెద్దలు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.



# ఏబీఎన్‌పై చర్యలు తీసుకోవాలి – శాసనమండలి చైర్మెన్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్సీలు

ఏబీఎన్లో ఇటీవల జరిగిన ఒక డిబేట్‌లో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ను అవమానించిన ఘటనలో తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీలు కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీని చానల్‌లో చర్చకు పిలిచి అవమానించడాన్ని తీవ్రంగా ఖండించారు. చర్చలో వ్యాఖ్యాత బీఆర్ఎస్‌పై కుట్రతో వ్యవహరించడంతో దానిని అడ్డుకునేందుకు తక్కళ్లపల్లి ప్రయత్నించారని గుర్తు చేశారు. తమ నేతలపై బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. దీనిని ఆయనపై జరిగిన దాడిగా కాకుండా శాసనమండలి సభ్యులపై జరిగిన దాడిగా భావించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. మొదటినుంచీ ఏబీఎన్ చానల్ తెలంగాణ వ్యతిరేకతను ప్రదర్శిస్తోందని




ఆరోపించారు. ఉద్యమానికి నష్టం చేసేలా కేసీఆర్‌పై విషప్రచారం చేస్తూ పత్రికా నిబంధనలు కూడా ఉల్లంఘించారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, విప్ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎల్ రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టులే 'ప్రెస్' స్టిక్కర్లు వినియోగించాలి

* **అనధికార వినియోగంపై చట్టపరమైన చర్యలు : డీపీఆర్వో విష్ణువర్ధన్.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 27 (భారత శక్తి): సమాచార పౌరసంబంధాల శాఖ నుంచి అధికారికంగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' అని రాసుకోవాలని లేదా స్టిక్కర్లు వినియోగించాలని జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ లేని వ్యక్తులు లేదా ఇతర సంస్థలకు చెందిన వారు వాహనాలపై ఇష్టారీతిన 'ప్రెస్' అని రాసుకోవడం మోటారు వాహన చట్టానికి విరుద్ధమని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ



అనధికారికంగా 'ప్రెస్' స్టిక్కర్లు వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో సంబంధిత జర్నలిస్టులు ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డును తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనాలపై అనధికారికంగా 'ప్రెస్' స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు, సంబంధిత వ్యక్తులు సహకరించాలని జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్ కోరారు.

# సంతోష్ కుమార్ వల్లే గద్దర్ ప్రజాభవన్ గేట్ బయట ఉండాల్సి వచ్చింది..

* **కవిత సంచలన వ్యాఖ్యలు**

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్ సిట్ విచారణకు హాజరుకానున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ, తన సోదరుడు సంతోష్‌కుమార్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్ కుమార్ గూఢచారి అని ఆరోపించారు. ఉద్యమనేతను (కేసీఆర్) ఉద్యమకారులకు దూరం చేసిందే ఆయనని మండిపడ్డారు. ప్రజా గాయకుడు గద్దర్ లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేటు బయట



ఉండాల్సి వచ్చిందే సంతోష్ వల్లనని ధ్వజమెత్తారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయనకు శిక్ష పడుతుందనే నమ్మకం తనకు లేదని చెప్పారు. సిట్ పిలవడం సరే కానీ.. ఏం శిక్షలు పడతాయో చూడాలని తెలిపారు. కామారెడ్డిలో డ్రగ్స్ గ్యాంగ్ చేతిలో తీవ్రంగా గాయపడి, నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆబ్కారీ కానిస్టేబుల్ సౌమ్యను కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంతోష్ కుమార్ ను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, సొంతపార్టీ ఏర్పాటు దిశగా కవిత వేగంగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ జాగృతిని రాజకీయ పార్టీగా మార్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి ఇప్పటికే దరఖాస్తు చేసినట్లు తెలుస్తున్నది. జాగృతి ప్రతినిధులు ఢిల్లీకి వెళ్లి దరఖాస్తును సమర్పించినట్లు సమాచారం. నిబంధనల ప్రకారం.. మూడు నెలల్లో తెలంగాణ జాగృతికి రాజకీయ పార్టీగా గుర్తింపు దక్కే అవకాశముందని జాగృతి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. అనుకున్నట్లుగా 3 నెలల్లో గుర్తింపు దక్కితే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆ పార్టీ బరిలోకి దిగే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా కవిత ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా: ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు..




హైదరాబాద్, జనవరి 27 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**ముఖ్యమైన తేదీల వివరాలు:**


* రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన వివరాల ప్రకారం ఎన్నికల ప్రక్రియ కింది విధంగా సాగనుంది:
* నామినేషన్ల స్వీకరణ: జనవరి 28 (బుధవారం) నుండి జనవరి 30 (శుక్రవారం) వరకు.
* పరిశీలన (Scrutiny): జనవరి 31న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.
* ఉపసంహరణ: ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకోవచ్చు.
* పోలింగ్: ఫిబ్రవరి 11 (బుధవారం) ఉదయం 7:00 నుండి సాయంత్రం 5:00 వరకు ఓటింగ్ జరుగుతుంది.
* ఫలితాలు: ఫిబ్రవరి 13 (శుక్రవారం) ఉదయం 8:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు.

**అభ్యర్థులకు నిబంధనలు:**

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమ ఆస్తి పన్ను మరియు నల్లా బిల్లుల బకాయిలు ఏవైనా ఉంటే వెంటనే చెల్లించాలని, 'నో డ్యూస్' సర్టిఫికేట్ సమర్పిస్తేనే నామినేషన్ చెల్లుబాటు అవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

**మేయర్, చైర్మన్ల ఎన్నిక:**

వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం, ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు మరియు కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎంపికకు పరోక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారు. ఈ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ మున్సిపల్ పోరులో సత్తా చాటాలని ఇప్పటికే ప్రచార వ్యూహాల్లో నిమగ్నమయ్యాయి.



## బ్రహ్మోత్సవాలకు విరాళం అందజేసిన చిలుక ఉపేందర్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ అల్కాపురిలో శ్రీ శృంగేరి జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం దక్షిణా శారద పీఠం, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వింశతి వార్షికోత్సవాలు ఈ నెల 29 నుండి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వార్ల కైంకర్యమును రూ. 25 వేలు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి మంగళవారం అందజేశారు. వీటిని బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్న ప్రసాద వితరణకు ప్రతినిత్యం కూరగాయల రూపంలో అందజేయనున్నట్లు ఆలయ ధర్మాధికారి కేవి శ్రీనివాస్ కు అందజేసారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర సైదులు, సంతోష్, నగేష్, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

* రూ. 1.39 కోట్లతో సి.సి రోడ్ల పనులకు శ్రీకారం: ప్రారంభించిన కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి..

## బి.ఎన్. రెడ్డి నగర్ అభివృద్ధికి బాటలు..



వనస్థలిపురం, జనవరి 27 (భారత శక్తి): బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సుమారు రూ. 1.39 కోట్ల వ్యయంతో చేపట్టిన సి.సి రోడ్ల ప్రారంభోత్సవాలు మరియు శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.

**వైదేహి నగర్‌లో సీసీ రోడ్ల ప్రారంభం..**

డివిజన్ లోని వైదేహి నగర్ కాలనీలో రూ. 83 లక్షల నిధులతో పూర్తి చేసిన సి.సి రోడ్లను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉన్న గుంతల రోడ్ల వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యంత నాణ్యతతో ఈ రోడ్లను నిర్మించినట్లు చెప్పారు.

**పలు కాలనీల్లో శంకుస్థాపనలు**

అనంతరం సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేస్ 1లో రూ. 19.50 లక్షలు, శ్రీపురం కాలనీలో రూ. 37 లక్షలతో చేపట్టనున్న సి.సి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ లోని ప్రతి కాలనీని దశలవారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

**ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు:**

బీజేపీ డివిజన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, కాలనీల అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, ముత్యంరావు, శ్రీధర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పద్మా రెడ్డి, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు. అలాగే సంక్షేమ సంఘం సభ్యులు విటల్ రెడ్డి, చంద్రయ్య, పురుషోత్తం రెడ్డి, శిరీష్, రాజేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సురేష్‌కుమార్ మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సిటీ నడిబొడ్డున 'హెల్త్ సెంటర్లు' వెంటనే ఏర్పాటు చేయాలి.!

* **ఇండస్ట్రీల ప్లేస్‌లో విద్యా, వైద్య హబ్‌లు ఏర్పాటు చేయాలి కాలుష్య కోరల్లో నగరం..**
* **సర్కారు సాహసోపేత నిర్ణయం తీసుకోవాలి కార్మికుల పిల్లలకు ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వాలి: అల్లంపల్లి రామకోటి డిమాండ్**



హైదరాబాద్, జనవరి 27 (భారత శక్తి): హైదరాబాద్ మహానగరాన్ని కాలుష్య రహితంగా మార్చడంతో పాటు, పేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రభుత్వం సాహసోపేతమైన అడుగులు వేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి డిమాండ్ చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక ప్రాంతాలను ఖాళీ చేయించి, ఆ స్థలాలను ప్రజా సంక్షేమ కేంద్రాలుగా (విద్యా వైద్య హబ్‌లు) మార్చాలని ఆయన కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పొల్యూషన్ హబ్‌లుగా మారిన నివాస ప్రాంతాలు ఉప్పల్ ఇండస్ట్రియల్ ఏరియా, ఆటోనగర్, మలక్‌పేట గంజి వంటి రద్దీ ప్రాంతాల్లో పరిశ్రమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రామకోటి ఆందోళన వ్యక్తం చేశారు. "ఇండస్ట్రియల్ పొల్యూషన్ వల్ల వేలాది మంది ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ కాలుష్య కారక పరిశ్రమలను వెంటనే నగరం వెలుపలకు తరలించాలి" అని ఆయన స్పష్టం చేశారు. జనాల ఆరోగ్యం దృష్ట్యా ఈ మార్పు అనివార్యమని పేర్కొన్నారు.

**కొత్తపేట స్ఫూర్తితోనే ముందుకు..**

గతంలో కొత్తపేట ఫ్రూట్ మార్కెట్‌ను తరలించి, అక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన తీరును ఆయన ఉదహరించారు. అది ఒక చారిత్రాత్మక పరిణామమని కొనియాడారు. అదే తరహాలో ఉప్పల్, ఆటోనగర్, మలక్‌పేట స్థలాలను కూడా కేవలం విద్యా, వైద్య అవసరాలకే కేటాయించాలని, తద్వారా తెలంగాణ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకాలని సూచించారు.

**కార్మికుల భద్రతే మా ప్రాధాన్యత:**

పరిశ్రమల తరలింపు ప్రక్రియలో కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకూడదని రామకోటి విజ్ఞప్తి చేశారు. పరిశ్రమల స్థానంలో నిర్మించే విద్యా, వైద్య సంస్థల్లో సదరు కార్మికుల పిల్లలకే మొదటి ప్రాధాన్యత (First Priority) కల్పించాలి. కార్మికులకు ఉచిత సేవలు అందేలా ప్రభుత్వం పక్కా ప్లాన్ చేయాలి. విద్యావైద్య హబ్‌ల ఏర్పాటుపై త్వరలోనే ముఖ్యమంత్రితో పాటు సంబంధిత మంత్రులకు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.




వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవింగ్ కేసులలో గౌరవనీయులైన సెకండ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హయత్ నగర్, ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష విధించారు. మాడుగుల మండలానికి చెందిన వెంకటయ్య అనే ఒక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష 15 వేల రూపాయల జరిమానా అలాగే ఆదిభట్లకి చెందిన సురేష్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష 10 వేల రూపాయల జరిమానా విధించబడింది. కాబట్టి ఎవరు కూడా తాగి వాహనాలు నడపవద్దని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో శిక్షించబడకూడదని వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ గట్టు మల్లు విజ్ఞప్తి చేశారు.

ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి):

## అక్రెడిటేషన్ జీవోను సవరించాల్సిందే.!

* **'ప్రెస్' స్టిక్కర్ నిబంధనను వెంటనే తొలగించండి.**
* **మంత్రి పొంగులేటి, స్పెషల్ కమిషనర్ ప్రియాంకకు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి..**
* **కేబుల్ ఛానళ్లు, నియోజకవర్గ రిపోర్టర్లకు అన్యాయం జరుగుతోంది..**
* **అక్రెడిటేషన్ లేని వారు జర్నలిస్టులు కాదా?: మామిడి సోమయ్య..**



హైదరాబాద్, జనవరి 27 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే సవరించిన మీడియా అక్రెడిటేషన్ జీవో 252లో ఇంకా లోపాలున్నాయని, దాన్ని సమూలంగా మార్చాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) డిమాండ్ చేసింది. మంగళవారం సచివాలయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, సమాచార భవన్‌లో స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంకను ఫెడరేషన్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో సవరణపై హర్షం వ్యక్తం చేస్తూనే, క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

**కేబుల్ ఛానళ్లకు మొండిచేయి!**

సవరించిన జీవోలో కేబుల్ ఛానళ్లు, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్ల ప్రస్తావనే లేకపోవడంపై నేతలు అసహనం వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కేబుల్ ఛానళ్లకు 12 రాష్ట్ర స్థాయి, 4 జిల్లా స్థాయి కార్డులు ఉండేవని, ఇప్పుడు ఆ ఊసే లేదని వాపోయారు. అలాగే ఎంపానల్‌మెంట్ లేని చిన్న, మధ్యతరహా పత్రికల్లో పనిచేసే జర్నలిస్టులకు కూడా కార్డులు మంజూరు చేయాలని కోరారు. క్రమం తప్పకుండా వస్తున్న పత్రికలను తక్షణమే ఎంపానల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఆ సర్క్యులర్ అవమానకరం..**

అక్రెడిటేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే వాహనాలపై 'ప్రెస్' స్టిక్కర్ వాడాలన్న నిబంధనను టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తీవ్రంగా తప్పుబట్టారు. "రాష్ట్రంలో 50 వేల మంది జర్నలిస్టులు ఉంటే, ప్రభుత్వం కేవలం సగం మందికే అక్రెడిటేషన్లు ఇస్తోంది. కార్డు లేనంత మాత్రాన వారు జర్నలిస్టులు కాకుండా పోతారా? కేవలం సంక్షేమ పథకాల కోసం ఇచ్చే కార్డును జర్నలిస్టు గుర్తింపునకు ప్రామాణికంగా మార్చడం వృత్తి స్వేచ్ఛను హరించడమే."

* **మామిడి సోమయ్య, టీడబ్ల్యూజేఎఫ్ కన్వీనర్**

నకిలీ జర్నలిస్టులను ఏరివేయడానికి ప్రత్యేక నిబంధనలు తేవాలే తప్ప, దాని పేరుతో అసలైన జర్నలిస్టులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అక్రెడిటేషన్ లేని రిపోర్టర్ల పరిస్థితి 'మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు' తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రియాంక.. రవాణా శాఖ అధికారులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు తన్నీరు శ్రీనివాస్, కుడుతాడు బాపురావు, రవి కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో 'సృజన'త్మక దోపిడీ!



హైదరాబాద్, జనవరి 27 (భారత శక్తి): తెలంగాణకు సిరులు కురిపించే సింగరేణిని కాంగ్రెస్ సర్కార్ 'కాసుల గని'గా మార్చుకుంది. నిబంధనలను తుంగలో తొక్కి, తన వారికి దోచిపెట్టేందుకు సరికొత్త స్కామ్‌లకు తెరలేపింది. సింగరేణిలో జరుగుతున్న ఈ దోపిడీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. మంగళవారం గవర్నర్‌ను కలిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిని 'కోల్ మాఫియా' డాన్‌గా అభివర్ణించారు.

**ఆ ఒక్క కండిషన్ వెనుక అసలు కథ!**

గతంలో ఎన్నడూ లేని విధంగా టెండర్లలో 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అనే నిబంధనను ఎందుకు తెచ్చారని కేటీఆర్ ప్రశ్నించారు. ఇది కేవలం సీఎం బావమరిది సృజన్ రెడ్డి కంపెనీలకు లాభం చేకూర్చడానికేనని ఆరోపించారు. "బీఆర్ఎస్ హయాంలో ట్రాన్స్‌పరెంట్‌గా టెండర్లు పిలిస్తే ఎస్టిమేటెడ్ కాస్ట్ కంటే తక్కువకే (మైనస్ టెండర్లు) పనులు జరిగాయి. మరి ఇప్పుడు రేట్లు ఎందుకు పెరిగాయి? ఎవరి జేబులు నింపడానికి ఈ దోపిడీ?" అని నిలదీశారు.

**సోలార్‌లో భారీ గోల్మాల్:**

దేశవ్యాప్తంగా ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 2.5 కోట్ల నుంచి రూ. 3 కోట్లు ఖర్చవుతుంటే, సింగరేణిలో మాత్రం ఏకంగా రూ. 7 కోట్లుగా కోట్ చేయడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రశ్నించారు. ఈ భారీ వ్యత్యాసం పక్కా కుంభకోణమని, ఈ దోపిడీని అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి విదేశాల్లో ఫోజులు కొడుతున్నారని విమర్శించారు.

**'పది కోట్ల'ఫుట్ బాల్ ఆట:**

సింగరేణి కార్మికుల కష్టార్జితమైన రూ. 10 కోట్ల నిధులను ఒక ఫుట్ బాల్ టోర్నీకి కేటాయించడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాష్ట్ర ప్రజలతో రేవంత్ ఫుట్ బాల్ ఆడుతున్నారు.. ఇప్పుడు సింగరేణి నిధులను కూడా ఆ ఆటకే తగలేస్తున్నారు" అని మండిపడ్డారు.

**'స్పెషల్ ఫోకస్ :**

* సైట్ విజిట్ సర్టిఫికెట్: అర్హత ఉన్న కంపెనీలను తప్పించి, 'సొంత' కాంట్రాక్టర్లకే టెండర్లు దక్కేలా చేసిన కుట్ర.
* జిలెటిన్ స్టిక్స్ స్కామ్: పేలుడు పదార్థాల ధరలను 30 శాతం అదనంగా పెంచి కాంట్రాక్టర్లకు మేలు.
* సైలెంట్ సీఎం: ఇన్ని ఆధారాలు బయటపెట్టినా ప్రభుత్వం నుంచి ఉలుకు లేదు.. పలుకు లేదు.
* గవర్నర్ ఎంట్రీ: ఈ స్కామ్ పై CBI లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గవర్నర్‌కు విన్నపం.

"చదువుకోవాల్సిన వయసులో చదువుకోకుండా, ఇప్పుడు విదేశాల్లో పాఠాలు నేర్చుకుంటానంటే ఏం వస్తుంది?" అంటూ సీఎంపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఈ అవినీతిపై కేంద్రం స్పందించి సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# ముగిసిన హల్వా వేడుక... బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!

ఢిల్లీ, జనవరి 27 (భారత శక్తి): కేంద్ర బడ్జెట్ 202627 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్‌ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు**

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్' ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, indiabudget.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఫ్రాన్స్‌లో తొలి హిందూ దేవాలయానికి శంకుస్థాపన

ఫ్రాన్స్, జనవరి 27: భారత్ - ఫ్రాన్స్ మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలు మరింత బలోపేతమయ్యేలా మరో అడుగు పడింది. పారిస్ సమీపంలోని బుస్సీసెయింట్ జార్జెస్‌లో నిర్మాణమవుతున్న మొదటి హిందూ దేవాలయానికి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన తొలి రాళ్లు వచ్చాయి. ఈ రాళ్లకు అక్కడున్న ఇండియన్ కమ్యూనిటీ ఘన స్వాగతం పలికింది. శతాబ్దాల నాటి హస్తకళా వారసత్వాన్ని, నైపుణ్యాన్ని ఉపయోగించి ఆలయాన్ని నిర్మించనున్నారు. ఆలయ నిర్మాణం కోసం భారతీయ కళాకారులు స్థానిక ఫ్రెంచ్ రాతి పనివారితో కలిసి పనిచేస్తారు. వీరిలో నోట్రేడామ్ కేథడ్రల్ పునరుద్ధరణలో పాల్గొన్న నిపుణుల బృందం కూడా ఉంది. భారతీయ వాస్తుశిల్ప సంప్రదాయాలను ఫ్రెంచ్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో ఏకం చేసి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ, "భారతదేశం నుంచి మొదటి రాళ్ల రాక ఒక చారిత్రాత్మక మైలురాయి. ప్రతి రాయి వారసత్వం, శ్రద్ధ, ఉద్దేశాన్ని కలిగి ఉంటుంది. ఇది భాగస్వామ్య గౌరవం, సహకారం ద్వారా భారతీయ సంప్రదాయం, ఫ్రెంచ్ ఇంజినీరింగ్ యొక్క ఐక్యతను సూచిస్తుంది" అని తెలిపారు.

# మేడారం జాతరకు సర్వం సిద్ధం... వివరాలు..!

ములుగు, జనవరి 27 (భారత శక్తి): తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర, మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర రేపు (జనవరి 28) ప్రారంభం కానుంది. ములుగు జిల్లాలోని మేడారం గ్రామంలో జరిగే ఈ నాలుగు రోజుల వేడుకకు దేశం నలుమూలల నుంచి సుమారు రెండు కోట్లకు పైగా భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గిరిజన పుణ్యక్షేత్రం ఇప్పటికే జనసంద్రంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా సహా పలు రాష్ట్రాల నుంచి గిరిజనులు, గిరిజనేతరులు ఈ జాతరకు పోటెత్తుతున్నారు. ఇప్పటికే గత కొద్ది రోజులుగా దాదాపు 10 లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మల వీరత్వాన్ని, త్యాగాన్ని స్మరించుకుంటూ రెండేళ్లకోసారి ఈ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

**ప్రభుత్వం భారీ ఏర్పాట్లు**

ఈ ఏడాది జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 251 కోట్లు ఖర్చు చేసింది. 21 శాఖలకు చెందిన 42,000 మందికి పైగా అధికారులు, సిబ్బందిని, 2000 మంది ఆదివాసీ వాలంటీర్లను భక్తుల సేవ కోసం నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 13,000 మంది పోలీసులను మోహరించారు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లతో జాతరను పర్యవేక్షిస్తున్నారు. 1,418 ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. జంపన్న వాగు వద్ద 200 మంది గజ ఈతగాళ్లను, 30 వైద్య శిబిరాల్లో 5,192 మంది వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పారిశుద్ధ్యం కోసం 5,000 మంది కార్మికులు, 5,700 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. భక్తుల రవాణా కోసం టీజీఎస్ఆర్టీసీ 4,000 ప్రత్యేక బస్సులను, దక్షిణ మధ్య రైల్వే 28 ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. పర్యాటక శాఖ హనుమకొండ నుంచి మేడారానికి హెలికాప్టర్ సేవలను కూడా అందిస్తోంది. రౌండ్ ట్రిప్‌తో కూడిన వీఐపీ దర్శనానికి రూ. 35,999, జాతర ఏరియల్ వ్యూ కోసం ఒక్కొక్కరికి రూ. 4,800 చొప్పున ఛార్జీలను నిర్ణయించారు.

**జాతర నేపథ్యం, సంప్రదాయాలు**

కాకతీయ పాలకుల పన్నుల విధానాన్ని ఎదిరించి పోరాడిన గిరిజన వీరవనితలు సమ్మక్క, ఆమె కుమార్తె సారక్క (సారలమ్మ)ల శౌర్యాన్ని స్మరించుకుంటూ ఈ జాతరను నిర్వహిస్తారు. కోయ తెగకు చెందిన ఈ తల్లీకూతుళ్లను గిరిజనులు దేవతలుగా కొలుస్తారు. పోరాటంలో అలసిపోయిన సమ్మక్క చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమయ్యిందని, ఆమె కోసం వెతికిన గిరిజనులకు ఓ వెదురు చెట్టు కింద కుంకుమ భరిణె మాత్రమే లభించిందని స్థానిక కథనం. అప్పటి నుంచి రెండేళ్లకోసారి గిరిజన పూజారులు వెదురు వనంలో ప్రత్యేక పూజలు చేసి, కుంకుమ భరిణె, ఎర్రటి వస్త్రం చుట్టిన వెదురు కర్రను సమ్మక్క ప్రతిరూపంగా భావించి గద్దెల వద్దకు తీసుకువస్తారు. అంతకుముందు రోజు కన్నేపల్లి నుంచి సారలమ్మను తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అధికారికంగా మొదలవుతుంది. భక్తులు తమ బరువుకు సమానమైన బెల్లాన్ని (బంగారం) అమ్మవార్లకు సమర్పిస్తారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ముఖ్యమైన సంప్రదాయం.

## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

అమరావతి, జనవరి 27 (భారత శక్తి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

*** అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం**

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**పదవిని బాధ్యతగా స్వీకరించాలి**

వ్యక్తులు శాశ్వతం కాదని, తెలుగుదేశం పార్టీయే శాశ్వతమని లోకేశ్ స్పష్టం చేశారు. "ఒక వ్యవస్థ కింద మనం అందరం నడుచుకోవాలి. పదవిని బాధ్యతగా స్వీకరించాలి. పార్టీ వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఒక కార్యకర్తగా పనిచేస్తున్నా" అని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, పార్టీ కార్యక్రమాలను 'మై టీడీపీ యాప్' ద్వారానే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు నిరంతర ప్రక్రియ అని, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం, ఆయన స్వయంగా శిక్షణ తరగతులకు హాజరై, వెనుక వరుసలో కూర్చుని ఒక నిత్య విద్యార్థిలా పాఠాలు వినడం అందరినీ ఆకట్టుకుంది.

*** స్వయంగా ఆహ్వానం పలికిన మంత్రి లోకేశ్**

అంతకుముందు, వర్క్‌షాప్‌కు హాజరైన పార్లమెంట్ కమిటీ సభ్యులకు మంత్రి లోకేశ్ స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారితో ఫోటోలు దిగారు. ఇదే సమయంలో, నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేద్దాం... పడగొట్టినవి నిలబెడదాం

అమరావతి, జనవరి 27 (భారత శక్తి): రాష్ట్రంలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన నిర్మాణాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన క్లస్టర్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో 10 జిల్లాలను ఉద్యాన కేంద్రాలుగా మార్చే సమీకృత అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**20 ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు**

గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టిందని ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, 10 జిల్లాల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ ఏడాదిలోనే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గాలేరునగరి ద్వారా కృష్ణా జలాలను కడప వరకు తీసుకెళ్లే అంశంపై దృష్టి సారించాలన్నారు. మొత్తంగా 20కి పైగా ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా కొత్తగా 8.87 లక్షల ఎకరాల ఆయకట్టుకు, మరో 4.30 లక్షల ఎకరాల స్థిరీకరణకు నీరందించవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలని, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయితే గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వరకు తీసుకెళ్లి, పోలవరంవంశధార నదుల అనుసంధానం చేపట్టవచ్చని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

*** ప్రపంచస్థాయి ఉద్యాన హబ్‌గా రాయలసీమ**

ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 500 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులను పండించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 10 జిల్లాల్లో 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. మూడేళ్లలో ఉద్యాన సాగు విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచేలా ప్రణాళికలు రూపొందించారు. దుబాయ్‌కి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ఏపీలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిందని సీఎం వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన గ్రామీణ రహదారుల నెట్‌వర్క్, లాజిస్టిక్స్, మార్కెట్, గ్లోబల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ బృహత్తర ప్రణాళికల అమలుకు పూర్వోదయ, సాస్కి, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పోర్ట్ కనెక్టివిటీ, గోదాములు, కోల్డ్ చైన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*** 10 జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయనున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల వివరాలు:**

- వెలిగొండ ప్రాజెక్ట్
- కొరిశపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- పాలేరు రిజర్వాయర్
- మల్లెమడుగు లిఫ్ట్‌రిజర్వాయర్
- శ్రీ బాలాజీ రిజర్వాయర్
- కుప్పం బ్రాంచ్ కెనాల్
- పుంగనూరు బ్రాంచ్ కెనాల్
- మూలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- హంద్రీనీవా ప్రధాన కాల్వ పనులు
- అట్లూరుపాడుమేర్లపాక ఎస్ఎస్ఎల్బీ
- నీవా బ్రాంచ్ కెనాల్ పనులు
- జీడిపల్లిభైరవానితిప్ప లిఫ్ట్ ఇరిగేషన్ పథకం
- జీడిపల్లిఅప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు
- అనంతలో కమ్యూనిటీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్
- మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులు
- పేరూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం
- కడప, కోడూరు వరకు గాలేరునగరి సుజల స్రవంతి
- అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు
- పశ్చిమ కర్నూలుకు నీళ్లిచ్చేలా వేదవతి అలగనూరుగాజులదిన్నె ప్రాజెక్టులు
- ఏడు జిల్లాల్లో 1,011 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి

## ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు


ఢిల్లీ, జనవరి 27 (భారత శక్తి): భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

## హైదరాబాద్ ఆకాశంలో 'వింగ్స్ ఇండియా' సందడి

హైదరాబాద్, జనవరి 27 (భారత శక్తి): భాగ్యనగరం మరో అంతర్జాతీయ వేడుకకు వేదికైంది. ఆసియాలోనే అతిపెద్ద సివిల్ ఏవియేషన్ ఎగ్జిబిషన్ 'వింగ్స్ ఇండియా 2026' బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ ఈవెంట్ కేవలం ఎయిర్ షో మాత్రమే కాదు, భారత దేశ విమానయాన రంగ భవిష్యత్తును, సాంకేతిక సత్తాను ప్రపంచానికి చాటిచెప్పే గొప్ప వేదిక.

**మేక్-ఇన్-రష్యా విమానాల రాక**

ఈ ఏడాది ప్రదర్శనలో రష్యాకు చెందిన రెండు సరికొత్త విమానాలు 'సూపర్‌జెట్', 'Il114300' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇవి పూర్తిగా రష్యా స్వదేశీ సాంకేతికతతో, ముఖ్యంగా రష్యా తయారీ PD8, TV7117ST01 ఇంజిన్లతో రూపొందించబడ్డాయి. మాస్కో సమీపంలోని



జుకోవ్స్కీ నుంచి పది దేశాల గగనతలం మీదుగా ప్రయాణించి ఈ విమానాలు హైదరాబాద్ చేరుకున్నాయి. సందర్శకులు ఈ విమానాల లోపలి భాగాలను నేరుగా చూసే అవకాశం కల్పించారు.

అర్బన్ ఫ్లయింగ్ టాక్సీలు: భవిష్యత్తులో నగరాల్లో ప్రయాణించే ఎగిరే టాక్సీల నమూనాలు ఈ వేడుకలో ప్రదర్శించనున్నారు.

ఎయిర్ ఇండియా కొత్త లుక్: ఎయిర్ ఇండియా తన B7879 విమానాల కోసం రూపొందించిన సరికొత్త ప్రీమియం క్యాబిన్ ఇంటీరియర్స్ ఇక్కడ ఆవిష్కరించనుంది.

ఏరియల్ డిస్‌ప్లే: గగనతలంలో పైలట్ల సాహసోపేత విన్యాసాలు సందర్శకులను కట్టిపడేయనున్నాయి.

కెరీర్ అవకాశాలు: విమానయాన రంగంలో స్థిరపడాలనుకునే యువతకు నిపుణులతో సంభాషించే అవకాశం ఉంటుంది.

**టికెట్లు, సందర్శన వివరాలు**

ఈ ప్రదర్శన జనవరి 28 నుంచి 31 వరకు కొనసాగుతుంది. డిజిటల్ ఎంట్రీ ద్వారా ఈజీ పద్ధతిలో ప్రవేశం కల్పించేందుకు బుక్ మై షో (BookMyShow)లో టికెట్లు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా నిలబెట్టే ఈ ప్రదర్శనను చూసేందుకు నగరవాసులు పెద్ద ఎత్తున తరలివస్తారని అధికారులు భావిస్తున్నారు.

# అర్ధరాత్రి స్కెచ్: గూబ గుయ్ మనేలా నోటిఫికేషన్..

# విపక్షాల గుండెల్లో రైళ్లు!





**పరిశోధనాత్మక పాత్రికేయులు**
**వి.జి (ఎం. వేణుగోపాల్)**


**హైదరాబాద్, జనవరి 27 భారత శక్తి:**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. కానీ, ఈసారి ఎలక్షన్ షెడ్యూల్ చూస్తుంటే అపోజిషన్ పార్టీలకు 'టైమ్' ఇయ్యకుండా ఉక్కిరిబిక్కిరి చేయాలన్న ప్లాన్ గట్టిగానే కనిపిస్తున్నది. "రాత్రికి రాత్రి స్కెచ్ గీసి.. పొద్దుగాలనే నోటిఫికేషన్ దంచికొట్టినట్టు" ఉంది పరిస్థితి. జనవరి 27న షెడ్యూల్ ఇచ్చి.. తెల్లారే (28న) నామినేషన్లు అంటే, అభ్యర్థులు బీఫారాల కోసం పరిగెత్తాల్నా? లేక పైసలు సర్దుబాటు చేసుకోవాల్నా? అని విపక్షాలు పరేషాన్ అవుతున్నాయి. ఈ మెరుపు వేగం వెనుక పెద్ద కథే ఉందన్న చర్చ నడుస్తోంది.

**1. ఆగం జేసేందుకే.. ఈ 'అకస్మాత్తు' ఆపరేషన్!**

సాధారణంగా ఎన్నికలు ఉన్నాయంటే నెల ముందే హడావుడి ఉంటది. కానీ ఇక్కడ సీన్ రివర్స్. అభ్యర్థులను వెతుక్కునే లోపే పోలింగ్ పెట్టేయాలన్నది అధికార పార్టీ 'ఇకమతు' (ఉపాయం) అని తెలుస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఫైనల్ చేసుకునే లోపే నామినేషన్ల గడువు ముగిసేలా ప్లాన్ చేశారు. అంటే, విపక్షాలు కోలుకోకముందే దెబ్బ కొట్టాలన్నది సర్కారు వ్యూహం. అసలు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే నామినేషన్ల ఘట్టం ముగించేయాలని హస్తం పార్టీ స్పీడ్ పెంచింది.

**2. బీసీ రిజర్వేషన్ల లొల్లికి చెక్!**

ఈసారి మున్సిపల్ ఎలక్షన్లలో బీసీ రిజర్వేషన్ల అంశం పెద్ద దుమారమే లేపింది. కులగణన, రిజర్వేషన్ల దామాషాపై విపక్షాలు కోర్టులకు వెళ్లి స్టే తెచ్చే లోపే ఎన్నికల ప్రక్రియను పట్టాలెక్కించాలని కాంగ్రెస్ భావించింది. ఒక్కసారి నోటిఫికేషన్ వచ్చిందంటే కోర్టులు కూడా జోక్యం చేసుకోవడం కష్టమని తెలిసి, ఈ 'రాకెట్ స్పీడ్' పెంచినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.



2 TELANGANA GAZETTE EXTRAORDINARY [Part-VI

**Annexure – I**
**2nd Ordinary Elections to Municipalities and Municipal Corporations, 2026**
**ELECTION SCHEDULE**

| Sl. No. | ELECTION PROGRAMME | DATE |
|---|---|---|
| 1 | (a) Date of issue of Election Notice by Returning Officer under sub-section 4 of section 195 of TM Act, 2019 duly mentioning the Reservation status of Wards | 28.01.2026 (Wednesday) (From this date onwards Nominations are received by Returning Officers from 10.30 AM to 5.00 PM) |
| | (b) Display of ward wise Electoral Rolls of ULBs by Returning Officer under Rule 4 of Telangana Municipalities and Municipal Corporations (Conduct of Elections) Rules, 2019 | 28.01.2026 (Wednesday) |
| 2 | Last date for filing Nominations | 30.01.2026 (Friday) (Upto to 5.00 PM) |
| 3 | Date of Scrutiny of Nominations | 31.01.2026 (Saturday) (from 11.00 AM onwards) |
| 4 | Date of publication of validly nominated candidates | 31.01.2026 (Saturday) (immediately after completion of scrutiny of nominations) |
| 5 | Date for appeal against rejection of nomination before the District Election Authority or Additional District Election Authority/ Deputy District Election Authority as authorized by District Election Authority concerned | 01.02.2026 (Sunday) (Upto to 5.00 PM) |
| 6 | Date for Disposal of appeal | 02.02.2026 (Monday) (Before 5.00 PM) |
| 7 | Last date for withdrawal of candidature | 03.02.2026 (Tuesday) (Upto 3:00 PM) |
| 8 | Date for Publication of final list of contesting candidates. | 03.02.2026 (Tuesday) (After 3:00 PM) |
| 9 | Date of Poll | 11.02.2026 (Wednesday) (From 7:00 AM to 5:00 PM) |
| 10 | Date of Re-Poll, if any | 12.02.2026 (Thursday) |
| 11 | Date of Counting of votes | 13.02.2026 (Friday) (From 8.00 AM onwards) |
| 12 | Date of declaration of results | Soon after the completion of counting of votes |

I. RANI KUMUDINI,
State Election Commissioner,
Telangana.

**3. 'నో డ్యూస్' మంత్రం.. అభ్యర్థులకు గండం!**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేటోళ్లు ఇంటి పన్ను, నల్లా బిల్లులు బకాయి ఉండొద్దని కండీషన్ పెట్టారు. ఎప్పుడో కట్టాల్సిన బిల్లులను ఇప్పుడు అర్జంటుగా కట్టాలనడం వెనుక అసలు 'ఇగురం' ఉంది. చాలామంది ఆశావహులు ఈ బకాయిల వల్ల నామినేషన్ వేసే టైమ్ కల్లా 'నో డ్యూస్' సర్టిఫికేట్ తెచ్చుకోలేక ఆగిపోయే ప్రమాదం ఉంది. ఇది ఒక రకంగా వడపోత కార్యక్రమమే అని విశ్లేషకులు అంటున్నారు. అభ్యర్థిని ఖరారు చేసుకున్నా.. సర్టిఫికేట్ రాకపోతే కథ అడ్డం తిరుగుతదని విపక్ష నేతలు భయపడుతున్నారు.

**4. గులాబీ కోటలకు కౌంట్‌డౌన్ మొదలైనట్టేనా?**

గత పదేళ్లుగా మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ హవా నడిచింది. ఇప్పుడు అదే పట్టును కాపాడుకోవాలని కేటీఆర్ కష్టపడుతుంటే.. పట్టణ ఓటర్లలో ఉన్న అసంతృప్తిని క్యాష్ చేసుకోవాలని రేవంత్ రెడ్డి సర్కార్ చూస్తోంది. సంక్షేమ పథకాల జోరు, రుణమాఫీ ఎఫెక్ట్ ఉండగానే ఎన్నికలు ముగిస్తే, పట్టణాల్లో కూడా 'చేయి' తిరుగులేని శక్తిగా మారుతుందని కాంగ్రెస్ నమ్మకం. గులాబీ కారుకు బ్రేకులు వేసి, అర్బన్ ఏరియాల్లో జెండా పాతాలని హస్తం నేతలు కసిగా ఉన్నారు.

**5. బీజేపీ గల్లీ ఫైట్.. కమలానికి కలిసొచ్చేనా?**

పట్టణాల్లో బీజేపీకి ఉన్న క్యాడర్ ఇప్పుడు ఆ పార్టీకి ప్లస్ పాయింట్. అయితే, కాంగ్రెస్ వేసిన ఈ 'స్పీడ్ ప్లాన్' వల్ల బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికలో తిప్పలు పడుతోంది. ఎవరికి టికెట్ ఇస్తే గెలుస్తారో లెక్కలు వేసే లోపే నామినేషన్ల గడువు ముగుస్తుండటంతో కమలనాథులు ఇప్పుడు హైకమాండ్ వైపు దిక్కులు చూస్తున్నారు. మోదీ చరిష్మాను నమ్ముకున్నా.. లోకల్ గా అభ్యర్థుల సెట్టింగ్ కు టైమ్ సరిపోకపోవడం ఆ పార్టీని కలవరపెడుతోంది.

మొత్తానికి సర్కారు విసిరిన ఈ 'మున్సిపల్ బాణం' విపక్షాలకు తగులుతుందా లేక రివర్స్ అవుతుందా అన్నది చూడాలి.



## భారత శక్తి క్యాలెండర్ ఆవిష్కరించిన డీసీపీ డాక్టర్ అనురాధ ఐపిఎస్

ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి): భారత శక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను తన కార్యాలయంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య,చైతన్యపురి సీఐ సైదులుతో కలిసి ఆవిష్కరించిన ఎల్బీనగర్ జోన్ డీసీపీ డాక్టర్ అనురాధ ఐపిఎస్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దినపత్రిక అనే సాధనం చాలా శక్తివంతమైనదని ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి దారి చూపేలా నిబద్ధతతో పని చేయాలనీ సూచించారు.



## కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి): లింగోజిగూడా డివిజన్ పరిధిలోని సౌభాగ్య నగర్ కమ్యూనిటి హాల్ నందు జరిగిన కుట్టు శిక్షణ సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిన లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ సీఈఓ.నాగరాజు,మేనేజర్ శ్రీనివాస్ గౌడ్,ఇంచార్జి బండి ప్రభావతిలకు ధన్యవాదాలు తెలిపారు.మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వడం గొప్ప అవకాశంగా భావిస్తున్నామని అన్నారు. ప్రతి మహిళ తన సొంతంగా ఉపాధి కోసం, మరి ఎక్కడైనా సంపాదించుకోవడానికి వీలవుతుందని తెలిపారు.ఈ సర్టిఫికెట్ తో ఉపాధి చాలా ఉంటుందని వివరించారు. మహిళలు అందరూ కూడా తన సొంత పిల్లలకు,తనకు ఈ మిషన్ కుట్టడం వల్ల ఉపాధి కలుగుతుంది. ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ అనేది పెరుగుతుందని పేర్కొన్నారు.ఒక మహిళ స్వంతంగా డబ్బులు సంపాదించవచ్చునని దీని వల్ల విలువలు పెరుగుతాయని అన్నారు.మహిళలకు ఇది ఉపాధి కల్పిస్తున్నందుకు చాలా సంతోషమని అన్నారు. అనంతరం కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికేట్లు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వరప్రసాద్ రెడ్డి, తిలక్ రావు,రాకేశ్ ఠాగూర్, నర్సింహా గుప్తా,చంద్రశేఖర్ రెడ్డి,కళావతి,శబానా, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు న్నారు.

## దేశ రాజధానిలో దొరికిన గొలుసు దొంగలు

* **హయత్ నగర్, నాగోల్, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా చైన్ స్నాచింగ్స్**
* **మహిళలు అప్రమత్తంగా ఉండాలి : డీసీపీ అనురాధ**
* **రాటుతేలిన ఇద్దరు గొలుసు దొంగల అరెస్ట్**



ఎల్బీనగర్, జనవరి 27 (భారత శక్తి): హయత్ నగర్, నాగోల్, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా చైన్ స్నాచింగ్స్ కు పాల్పడిన ఢిల్లీ దొంగలను మంగళవారం చైతన్యపురి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎల్బీనగర్ డీసీపీ డాక్టర్ అనురాధ తెలిపారు.ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో కేసు వివరాలను డీసీపీ అనురాధ వెల్లడించారు. సంక్రాంతి పండుగ అనంతరం ఎల్బీనగర్ డీసీపీ జోన్ పరిధిలో మూడు చైన్ స్నాచింగ్స్, ఒక చైన్ స్నాచింగ్ చేయబోయి విఫలమయ్యారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి,సాంకేతిక ఆధారాలతో సహాయంతో అక్షయ్ కుమార్ శర్మ(29) రోహిత్(26) అనే ఇద్దరు నిందితులను దేశ రాజధాని న్యూఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. అక్షయ కుమార్ శర్మపై వివిధ పోలీస్ స్టేషన్లో మొత్తం 21 కేసులు ఉన్నాయి. ఒక్క డిల్లీలోనే 19 కేసులు నమోదైనట్లు గుర్తించారు. రోహిత్ పై 13 కేసులు ఉన్నాయి. ఈ కేసులు మొత్తం ఢిల్లీ, మహారాష్ట్రలోని నాగపూర్ లో కేసులు ఉన్నాయి. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 9 కేసులు ఉన్నాయి. ఇద్దరు నిందితులు మొదటగా ద్విచక్ర వాహనం దొంగతనం చేసి, ఆదే వాహనంపై తిరుగుతూ చైన్ స్నాచింగ్ పాల్పడి,వాహనాన్ని వదిలేసి వెళ్ళిపోతారు. నిందితుల దగ్గర నుంచి బంగారంతో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీసీపీ అనురాధ మాట్లాడుతూ, బంగారం ధరలు భారీగా పెరగడంతో సులభంగా డబ్బు సంపాదించడానికి చైన్ స్నాచింగ్స్ కు పాల్పడుతున్నారని, ప్రజలు, ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో బంగారు ఆభరణాలకు బదులుగా వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ధరించాలని సూచించారు.ఎల్బీనగర్ డీసీపీ పరిధిలో దొంగతనాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ అనురాధ తెలిపారు.ఈ పత్రికా సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య, సీఐ సైదులు డిఐ గురుస్వామి, ఎస్ఐలు వెంకటయ్య, విక్రమ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.ఈ కేసును చేధించిన 3 బృందాల అధికారులకు, సాంకేతిక నిపుణులకు డీసీపీ నగదు బహుమతి అందించారు.



## పల్లె దవాఖానాల్లో సేవలపై నజర్..!

* **మెరుగైన వైద్యంతో జిల్లాను నంబర్ వన్ చేయాలి: డీఎంహెచ్ఓ లలితాదేవి**



రంగారెడ్డి, జనవరి 27 (భారత శక్తి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పల్లె దవాఖానాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ లలితాదేవి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా ఆరోగ్య శాఖ కార్యాలయంలో 158 మంది పల్లె దవాఖానా వైద్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అందుతున్న వైద్య సేవలపై దిశానిర్దేశం చేశారు. 12 రకాల సేవలు తప్పనిసరి. గ్రామాల్లో మాతా శిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ముఖ్యంగా:
అంటువ్యాధులు కానివి (అసంక్రామిత వ్యాధులు): బీపీ, షుగర్ వంటి వ్యాధుల నియంత్రణ.
క్యాన్సర్ సంరక్షణ: క్యాన్సర్ బాధితులకు అవసరమైన ప్రాథమిక చికిత్స, సలహాలు, ముసలివారికి ఇంటి వద్దే వైద్యం అందేలా చూడటం.ప్రభుత్వ కార్యక్రమాలు: ప్రభుత్వం నిర్దేశించిన 12 రకాల ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ఈ సేవల ద్వారా జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని ఆమె వైద్యులను కోరారు.

**ఆన్‌లైన్ సేవలకు ఇంటర్నెట్ కిట్లు**

పల్లెల్లో నిరంతరాయంగా ఆన్‌లైన్ వైద్య సేవలు (టెలి మెడిసిన్) అందించడానికి వైద్యులకు ఇంటర్నెట్ పరికరాలను (డాంగిల్స్, సిమ్ కార్డులు) పంపిణీ చేశారు. అలాగే సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (CPHC) శిక్షణలో ప్రతిభ కనబరిచిన వైద్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

**ఈ సమీక్షలో పాల్గొన్న అధికారులు,**

అదనపు జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాపారావు, పల్లె దవాఖానాల ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వినోద్, డాక్టర్ రాజేష్, డెప్యూటీ డీఎంహెచ్ఓలు, డెమో శ్రీనివాసులు, డీపీఓ ఆక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.